అనుదినం.. జనస్వరం

నిజామాబాద్-కామారెడ్డి

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

04 పేజీలు   శుక్రవారం 02 జూన్ 2023



పేద విద్యార్థులకు మెరుగైన విద్య

- విదేశాల్లో విద్యకోసం అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం
- ఎస్సీ కులాల అభివృద్ధిశాఖ అధికారి శశికళ

2లో..

రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని
నవతెలంగాణ ప్రత్యేక సంచిక

45 ఏండ్ల కలకు 'దశాబ్ధ' రూపం

- తెలంగాణ ఏర్పాటుకు 9 యేండ్లు పూర్తి
- నేడు పదో వసంతంలోకి అడుగు
- అట్టహాసంగా వేడుకలకు సర్కారు నిర్ణయం
- ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ కేంద్రంగా టీయూ
- జేపీసీతో ప్రత్యేక రాష్ట్ర పోరు ముందుకు

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఇందూరు గడ్డ పోరుగడ్డగా మారింది. సబ్బండ వర్గాలు సమరశంఖం పూరించాయి. కుల మతాల ప్రస్తావన లేదు. కులాల నాయకుల ఆదిపత్య పోరు లేదు. అందరి గొంతులో ఒకే నినాదం. 'జై తెలంగాణ'. మా తెలంగాణ మాగ్గావాలే అని ఉద్యోగులు పెన్‌డౌన్ చేశారు. కుల సంఘాలు రోడ్లు ఎక్కాయి. కోర్టుల్లో వాదించే న్యాయవాదులు జెండాలు పట్టి పోరు జరిపారు. వార్తలు రాసే జర్నలిస్టులు సైతం జై తెలంగాణ నినాదం ఎత్తుకున్నారు. సబ్బండ వర్గాల ఐక్య పోరుతో నాటి కేంద్ర ప్రభుత్వం మెడ వచ్చింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేస్తామనిక నాటి ఆర్థిక శాఖ మంత్రి చిందబరం డిసెంబర్ 9న ఎట్టకేలకు ప్రకటన చేశారు. ఈ ప్రకటనతోనే తెలంగాణ సమాజం సంబురపడలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయ్యేదాక పోరు వీడలేదు. దీంతో ఫిబ్రవరిలో బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. పది జిల్లాలో తెలంగాణ రాష్ట్ర బిల్లుకు ఆమోదం లభించింది. మార్చి 1, 2014లో గెజిట్ విడుదల య్యింది. ఇక అధికారి కంగా జూన్ 2 వ తేదీన తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగింది. మొదటి ముఖ్య మంత్రిగా సీఎం కేసీఆర్ ప్రమాణ స్వీకారం చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం మొట్ట మొదట 1969లో ఉద్యమం ప్రారంభమయ్యింది. ఆ తరువాత 1972లోనూ ఉద్యమం చేశారు. ఇక 2009లో మలిదశ ఉద్యమంతో ప్రత్యేక రాష్ట్ర కల సాకారమయ్యింది.


విద్యుత్ దీపాల కాంతులతో మెరిసిపోతున్న కలెక్టరేట్

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ఇందూరు గడ్డ ప్రముఖ పాత్ర పోషించింది. 'ఓ నిజాము పిశాచమా ! కానరాడు నిన్ను బోలిన రాజు మాకెన్నడేని తీగెలను త్రెంపి అగ్నిలో దింపినావు నా తెలంగాణ కోటి రత్నాల వీణ' అన్న దాశరథి మాటల ప్రేరణతో నిజామాబాద్ గడ్డపై ఉద్యమం జోరందుకుంది. సమైక్య పాలనలో జరుగుతున్న అన్యాయాలను సహించిన సమాజం.. ఇకపై మా పాలన మాకేనంటూ ఉద్యమం చేపట్టారు. నిజామాబాద్‌లో అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, కుల సంఘాలు జేఏసీ కింద ఒక గొడుగు కిందకు వచ్చి ప్రతి రోజూ ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమాలు చేపట్టారు. మలి దశ ఉద్యమంలో ఏనాడూ వెనక్కి తగ్గకుండా పోరు జరిపారు. ప్రస్తుత పాత కలెక్టరేట్(ధర్నా చౌక్) నిత్యం తెలంగాణ నినాదంతో నాడు మారుమోగేది. ఆనాటి రాష్ట్ర ప్రభుత్వం పోలీసు బలంతో ఉద్యమాన్ని అణిచివేయాలని చూసినప్పటికీ.. అన్ని వర్గాలు ఉద్యమంలోకి రావడంతో సర్కారుకు తలవంచకతప్పలేదు. ఉద్యమంలో విద్యార్థుల పాత్ర అమోఘమైనది. జిల్లాలో మొట్టమొదటగా ప్రత్యేక రాష్ట్రం కోసం తెలంగాణ యూనివర్శిటీలోనే ఉద్యమం రాజుకుంది. ఆ తరువాత అది జిల్లా అంతా పాకింది. తెలంగాణ యూనివర్శిటీలో పోలీసు లను మోహరించినా.. విద్యార్థులు వెనకడుగు వేయలే దు. నిర్బంధాలను ఎదురించి ప్రత్యేక రాష్ట్ర నినాదం ఎత్తుకున్నారు. ఆ సమయంలో ఎంతో మంది విద్యార్థులపై కేసులు నమోదు చేశారు. ఆ తరు వాత ఉద్యోగుల పాత్ర మరవలేనిది. అటు ఉద్యోగ ధర్మం నిర్వహిస్తూనే ఇటు ఉద్యమంలో పాలుపంచు కున్నారు. ఇక రాష్ట్రం కోసం పెన్‌డౌన్ చేపట్టిన ఉద్యోగులు ఐక్యంగా ముందుకు సాగారు. ఉద్యోగాలు ఊడదీస్తామని హెచ్చరించినా.. ఉద్య మానికే మొగ్గు చూపారు. ఉద్యోగులతో పాటు న్యాయ వాదులు సైతం కోర్టు ఆవరణను ఉద్యమ కేంద్రంగా మార్చారు. జిల్లా న్యాయస్థానం ముందు ప్రతిరోజూ నిరసనలు, ఆందోళనలు చేపట్టారు. ఇక ప్రజా సంఘాలు, సీపీఐ, సీపీఐ(ఎంఎల్) వామపక్ష పార్టీలు ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో పెద్దన్న పాత్ర పోషించాయి. జనాలను ఐక్యం చేసి ఉద్యమ నినాదం చేయించడం లో విజయ వంతమ య్యాయి.

▸ మిగతా 2లో..

అభివృద్ధిలో నెంబర్‌వన్ రాంపూర్ (డి)

- అందరి సహకారంతోనే
- గ్రామానికి వన్నె తెచ్చిన మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్
- గ్రామ స్వరాజ్య స్థాపనకు కృషి

జాతిపిత మహాత్మా గాంధీ కన్న కలలను నిజంచేస్తూ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి నెంబర్-1గా నిలిచింది డిచ్‌పల్లి మండలంలోని రాంపూర్ (డి) గ్రామం. మాజీ ఎమ్మెల్సీ వి.గంగాధర్ గౌడ్, గ్రామపంచాయతీ పాలకవర్గం, గ్రామ అభివృద్ధి కమిటీ, గ్రామస్తులు, ఎంపిటిసి, యువజన సంఘాలు అందరు కలిసికట్టుగా గ్రామంలో ఏ సమస్య నెలకొన్నా దాన్ని పరిష్కరిస్తూ కోట్లాది రూపాయలతో అభివృద్ధి వైపు అడుగులు వేసింది. గ్రామంలో నిర్విరామంగా సాగుతున్న పారిశుధ్య పనులతో ఏకంగా గ్రామానికి ఆరోగ్య అవార్డు వరించింది. గ్రామపంచాయతీ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కోట నుండి వచ్చే నిధులతో గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టారు. ఎన్నో గ్రామాలకు ఆదర్శ గ్రామంగా నిలిచారు రాంపూర్ గ్రామస్తులు.

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గ్రామపంచాయతీ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కోట నుండి వచ్చే నిధులతో ప్రతి గల్లీలో రహదారులు, సీసీ డ్రైన్లను నిర్మాణం చేపట్టారు. గ్రామం మొత్తంలో వెయ్యి మీటర్ల మీద సీసీ రహదారులు రెండువేల మీటర్ల సిసి డ్రైనేజీల నిర్మాణాలు చేపట్టి ఎన్నో గ్రామాలకు ఆదర్శ గ్రామంగా నిలిచింది. గ్రామంలో సమస్యలు లేకుండా కృషి చేసిన సర్పంచ్ పాపాయి తిరుపతి, ఉప సర్పంచ్ ఎంకన్న రమేష్, గ్రామ అభివృద్ధి కమిటీ, ఎంపిటిసి, ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్సీ, బీఅర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీ. గంగాధర్ గౌడ్ గ్రామంలో బీసీ గురుకులం తీసుకువచ్చి కమ్యూనిటీ హాళ్లను అద్దెకు తీసుకొని అందులో ఏర్పాటు చేశారు.

గ్రామానికి వచ్చిన నిధులు..

ప్రాథమిక పాఠశాలలో 12 లక్షల రూపాయలతో అదనపు గదులు నిర్మాణం, గ్రామపంచాయతీ ప్రహరీ గోడ నిర్మాణం కు 9 లక్షలు, గ్రామంలో ఉన్న నాలుగు అంగన్వాడి భవనాల మరమ్మతులకు 20 లక్షలు, చెక్ డ్యామ్ నిర్మాణానికి మూడు కోట్లు, నూతన కాలువల నిర్మాణానికి 30 లక్షలు, ఓల్డ్ ఏజ్ హెూమ్ నిర్మాణానికి ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు విజీ గౌడ్ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి ప్రభుత్వం నుండి 50 లక్షలు, రెడ్ క్రాస్ సొసైటీ నుండి 50 లక్షలు కలుపుకొని కోటి రూపాయలతో సుందరవంతంగా భవన నిర్మాణం, గార్డెన్ ఏర్పాటు చేశారు. దాదాపు 80 లక్షల రూపాయలతో గ్రామంలో వెయ్యి మీటర్ల మేర సిసి రహదారుల నిర్మాణం చేపట్టారు. దీనిలో గ్రామపంచాయతీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నిధులతో పనులను పూర్తి చేశారు. గ్రామంలో రెండువేల మీటర్ల సిసి డ్రైనేజీల నిర్మాణంకు గాను 80 లక్షల రూపాయలను వెచ్చించి పనులను పూర్తి చేశారు.



రాంపూర్‌డి గ్రామం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, వీజీగౌడ్ (ఫైల్)

కుల సంఘా భవనాల నిర్మాణం...

శేరు సంఘ భవన నిర్మాణానికి 10 లక్షలు, పుప్పల కుల సంఘాలకు 10 లక్షలు, రజక సంఘంకు ఐదు లక్షలు, ఇర్ల పేద్దోల్ల సంఘానికి 5లక్షలు, ఇర్ల చిన్నోల్ల సంఘానికి 5 లక్షలు, గొల్ల, కురుమ సంఘాలకు 10 లక్షలు, మాల సంఘంకు 5 లక్షలు, మాదిగ సంఘానికి రెండు లక్షలు, శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం హరిజనవాడలో 10 లక్షలు, రాంపూర్ లక్ష్మీనరసింహస్వామి దత్తాత్రేయ ఆలయం వద్ద కళ్యాణ మండపానికి 9 లక్షలు, హనుమాన్ ఆలయం వద్ద షెడ్డు నిర్మాణానికి ఐదు లక్షలు, వీఆర్వో బిల్డింగ్ నిర్మాణానికి ఐదు లక్షలు, పశువుల ఆసుపత్రికి 16 లక్షలు, అగ్రికల్చర్ గోదాం నిర్మాణానికి 10 లక్షలు, రైతు వేదికకు 30 లక్షలు, మన ఊరు మన బడి కింద పాఠశాలలో బాత్రూంలు, కిచెన్ షెడ్, సంపు, ఇతర మరమ్మతు పనులకు గాను 60 లక్షల రూపాయలు, గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం నుండి స్వాగత తోరణం వరకు వీధి దీపాల కోసం స్తంభాలు, రైతు వేదిక నుండి ఓల్డ్ ఏజ్ హెూం, ప్రాథమిక పాఠశాల, శ్మశాన వాటిక వరకు రెండు లక్షల రూపాయలు గ్రామపంచాయతీ నిధులతో స్తంభాలను ఏర్పాటు చేసి వీధిదీపాలను అమర్చారు. పల్లె ప్రగతిలో భాగంగా గ్రామంలో ఉన్న అమురుగు కాల్వలను పరిశుభ్రం చేస్తూ అత్యవసరం ఉన్నచోట రహదారులకిరువైపులా మొరంపోసి గుంతలు లేకుండా చేపట్టడంలో గ్రామపంచాయతీ తనకంటూ ఒక స్థానాన్ని ఏర్పరచుకుంది. శ్మశాన వాటిక వద్ద లక్ష రూపాయలతో బోర్ మోటార్ బిగించి లక్ష రూపాయలతో మొరంను వేసి చదును చేయడంతో పాటు రాళ్లు, రప్పలను తొలగించడానికి రెండున్నర లక్షల రూపాయలను వెచ్చించి సుందరంగా తీర్చిదిద్దారు.

హరితహారంలో ఎవెన్యూ ప్లాంటేషన్ నెలకొల్పి రహదారులకు ఇరువైపులా మొక్కలను పెంచి ఆహ్లాదాన్ని ఇచ్చే విధంగా గ్రామపంచా యతీ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి అనునిత్యం ట్రాక్టర్ ట్యాంకర్ ద్వారా మొక్కలను నీరు పోస్తూ కంటికి రెప్పలా కాపాడుతూ సంరక్షించారు. ఏ గ్రామంలో చూసిన ఒకే ఒక స్మశాన వాటిక ఉండేది. కానీ ఇక్కడ రెండు శ్మశాన వాటికలను ఏర్పాటు చేసి గ్రామస్తులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు సుందరంగా తీర్చిదిద్దారు. ఇదే కాకుండా ఒక డంపింగ్ యార్డు, పల్లె ప్రకృతి వనం, మన ఊరు మన నర్సరీ, మూడు గ్రీన్ పార్కులను ఏర్పాటు చేశారు. వైకుంఠ ధామం, గ్రీన్ పార్కులను ఏర్పాటులో గ్రామపంచాయతీ ప్రముఖ పాత్ర పోషిస్తుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. గ్రామానికి త్వరలో ఆరోగ్య కేంద్రం వచ్చే అవకాశం ఉందని, చుట్టుపక్కల ఉన్న గ్రామాల ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందని సర్పంచ్ పాపాయి తిరుపతి నవ తెలంగాణ కు వివరించారు.

రాంపూర్ గ్రామం నుండి ఇందల్వాయి మండలంలోని వెంగల్‌పాడ్ తాండవరకు రెండవ చెక్ డ్యామ్ నిర్మాణానికి రెండు కోట్ల 50 లక్షల రూపాయలను మంజూరు అయ్యాయి. రాంపూర్ గ్రామం నుండి కమలాపూర్ బీటి రోడ్డు రెన్యువల్‌కు 60 లక్షలు, గ్రామానికి చెందిన యువకులు గల్ఫ్‌లో ఉంటూ గల్ఫ్ అసోసియేషన్ ఏర్పాటు చేసుకొని గ్రామంలో హనుమాన్ ఆలయ నిర్మాణానికి 20 లక్షల రూపాయలను అందజేశారు. గ్రామానికి చెందిన దాత స్వర్గరథంను గ్రామ పంచాయతీకి అందజేశారు. పంచాయతీ నిధులతో నూతనంగా ఒక ట్రాక్టర్, ట్యాంకర్‌ను కొనుగోలు చేశారు. మొక్కలను సంరక్షించడానికి, గ్రామ పంచాయతీలో ఉన్న మొత్తం పదిమంది కార్మికులతో శుభ్రం చేస్తున్నారు.



గ్రామంలో వేసిన రోడ్లు

సేవ చేసే భాగ్యం కల్పించారు

సర్పంచ్ పాపాయి తిరుపతి



గ్రామం వాసి మాజీ ఎమ్మెల్సీ వి గంగాధర్ గౌడ్, ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, గ్రామ అభివృద్ధి కమిటీ, గ్రామస్తుల సహాయ సహకారాలతో కోట్ల రూపాయల మేర నిధులు మంజూరయ్యాయి. అభివృద్ధి ధ్యేయంగా పాలకవర్గంతో కలిసి కృషి చేశా.. గ్రామస్తులు సేవ చేసే భాగ్యం కల్పించడంతోనే ఈ అవకాశం వచ్చింది.

మళ్లీ అవకాశం కల్పిస్తే మరింత సేవ చేస్తా..

ఎంకనోల్ల రమేష్-ఉప సర్పంచ్



గ్రామస్తులు నన్ను ఎన్నుకోవడం నా అదృష్టం. మళ్లీ అవకాశం కల్పిస్తే మరింత సేవ చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తా. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి అందరి సహాయ సహకారాలు పాలకవర్గం కృషి అమోఘం. మాజీ ఎమ్మెల్సీ వి గంగాధర్ గౌడ్ కృషి ఫలితంతోనే కోట్లాది రూపాయల మేర నిధులు మంజూరు కావడం హర్షించదగ్గ విషయం. ఎంత చేసిన పుట్టిన గ్రామం రుణం తీర్చుకోలేనిది. .

పేద విద్యార్థులకు మెరుగైన విద్య

- విదేశాల్లో విద్యకోసం అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం
- రాజీవ్ విద్యదీవెనలో 9,10 విద్యార్థులకు ఉపకార వేతనం
- ఎస్సీ కులాల అభివృద్ధిశాఖ అధికారి శశికళ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని ఎస్సీ కులాల అభివృద్ధి శాఖ అధికారి బి.శశికళ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా నవ తెలంగాణ తెలుగు దినపత్రికతో మాట్లాడారు. బెస్ట్ అవైలబుల్ పథకం కింద జిల్లాలోని ఎంపిక చేసిన ప్రైవేటు పాఠశాలలు, నాన్ రెసిడెన్షియల్ విభాగంలో ఒకటవ తరగతి నుండి 41 మంది విద్యార్థులకు విద్యను అందించారు. అదేవిధంగా ఐదవ తరగతిలో ప్రవేశం పొందే రెసిడెన్షియల్ విద్యార్థులను ఎంపిక చేసి, ఎంపిక చేసిన ప్రైవేటు పాఠశాలలో సీట్ల ఖాళీలను బట్టి ప్రభుత్వం ఎంచు కున్న పాఠశాలలో విద్యార్థులను చేర్పించాం. ఆ పద్ధతిన 38 మంది విద్యార్థుల కు విద్య ను అందించడం జరిగిందని తెలిపారు. కళాశాల వసతి గృహాలలో విద్యార్థులకు కాలేజీ బ్యాగులు, తినడానికి ప్లేట్లు, గ్లాసులు, గిన్నెలు విద్యార్థుల కు అందిస్తున్నాం. ఎస్సీ విద్యార్థులకు ఉపకార వేతనాలద్వారా ప్రీ మెట్రిక్ స్కాలర్షిప్ అందిస్తున్నాం.

అందులో భాగంగా 5 నుంచి 8 తరగతి వరకు చదువుకునే విద్యార్థులకు బాలురకు వెయ్యి చొప్పున సంవత్స రానికి, బాలికలకు రూ.1500 చొప్పున సంవత్సరానికి వస్తున్నాయి. 9, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు రాజీవ్ విద్యదీవెన పథకంలో భాగంగా సంవత్సరానికి మూడు వేల రూపాయలు ఉపకార వేతనం వస్తున్నాయి. పోస్ట్ మెట్రిక్ స్కాలర్షిప్ పథకం కింద ఇంటర్, డిగ్రీ, పిజీ, ఇంజనీరింగ్ చదివే విద్యార్థులు జిల్లాలో 6900 మంది దరఖాస్తు చేసుకోగా 4460 మంది విద్యార్థులకు స్కాలర్ షిప్ చెల్లించడం జరిగింది. మిగతావారికి బడ్జెట్ వచ్చిందని వారికి కూడా స్కాలర్షిప్ చెల్లిస్తున్నాం. ఇతర దేశాలలో వెళ్లి చదువుకునే విద్యార్థుల కోసం ప్రత్యేకంగా అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ విదేశాలలో పీజీ కోసం 20 లక్షల వరకు సమకూర్చడం జరుగుతుంది. ఇప్పటివరకు 50 మంది విద్యార్థులకు విదేశాల్లో విద్య నేర్చుకోవడానికి పంపించాం.



శశికళ

45 ఏండ్ల కలకు 'దశాబ్ధ' రూపం

-మొదటిపేజీ తరువాయి

అప్పటికే ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేపట్టిన అనుభవంతో ప్రత్యేక రాష్ట్రం కోసం కూడా అలుపెరగని పోరాటాలు చేపట్టారు. ఇక టీఆర్ఎస్ ప్రస్తుత బీఆర్ఎస్ నాయకులు సైతం ఉద్యమంలో ముందు భాగాన నిలిచారు. కేసీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు జేఏసీగా ఉద్యమాలు చేపట్టారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలో జిల్లాలో టీఆర్ఎస్ బలహీనంగా ఉన్నప్పటికీ.. వామపక్ష, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలతో కలిపి ఉద్యమంలో భాగస్వామ్యం అయ్యింది.

ఘనంగా దశాబ్ది ఉత్సవాలు..

ఎన్నో పోరాటాలు, త్యాగాల ద్వారా సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం ఏర్పడి తొమ్మిది వసంతాలు పూర్తి చేసుకుని నేడు పదో వసంతంలోకి అడుగుపెడుతుంది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం జూన్ 22వ తేదీ వరకు దశాబ్ధి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని నిర్ణయించింది.

అద్దంలా మెరుస్తున్న సర్కారు బడి

- మన ఊరు-మనబడితో మారుతున్న రూపురేఖలు
- నిజామాబాద్ 303 స్కూళ్లలో పనులు ప్రారంభం
- కామారెడ్డిలో 351 పాఠశాలలు ఎంపిక
- ఉమ్మడి జిల్లాలో 2,491 స్కూళ్లు

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో మౌలిక వసతులు అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు-మన బడి, మన బస్తీ-మన బడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమం కింద దశలవారిగా అన్ని పాఠశాలల్లో మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా నిజామాబాద్ జిల్లాలో మొదటి విడతలో 407 పాఠశాలలు ఎంపికయ్యాయి. కామారెడ్డిలో 351 స్కూళ్లను సెలెక్ట్ చేశారు. నిజామాబాద్‌లో ఎంపిక చేసిన 407 స్కూళ్లలో 341 పాఠశాలలు గ్రామీణ ప్రాంతాలకు చెందినవి కాగా 66 పాఠశాలలు పట్టణ




బోధన్ పట్టణంలోని రాకాసిపేట్‌లో మన ఊరు, మన బడి పనులకు ముందు, పనుల తర్వాత

ప్రాంతాలకు చెందినవి. పాఠాశాల యాజమాన్య కమిటీతో పాఠాశాల అవసరాలు గుర్తించిన తర్వాత జిల్లా కలెక్టర్ నియమించిన నిర్వహణ ఏజెన్సీ ఆ అవసరాలకు తగిన అంచనాలు తయారు చేస్తుంది. ఆ అంచనాలకు పరిపాలన అనుమతులు మంజూరు అయిన తర్వాత సాంకేతిక అనుమతులు మంజూరు చేస్తారు. ఆ తరువాత పనులు ప్రారంభిస్తారు. పథకంలో ఎలాంటి లోటుపాట్లు జరగకుండా సర్కారు పక్కాగా ప్లాన్ రూపొందించింది. అయితే పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పనులు కొంత ఆలస్యంగా మొదల య్యాయి.

మన ఊరు-మన బడిలో భాగంగా నిజామా బాద్‌లో మొదటి విడతలో 407 పాఠశాలలు ఎంపిక చేయగా.. 405 పాఠశాలలకు అంచనాలు రూపొందించారు. అందులో 297 పాఠశాలల్లోని పనులు ఎస్ఎంసీలచే, 108 పాఠశాలల్లోని పనులు కాంట్రాక్టర్‌లతో ప్రారంభిం చారు. ఇప్పటివరకు 303 పాఠశాలలకు రూ.16.37 కోట్ల నిధులు అందజేశారు. అయితే జిల్లాలో 59 పాఠశాలలను ఎంపిక చేసి మొదటి విడతలో ప్రారంభోత్సవం చేయటానికి పనులు శరవేగంగా జరుగుతున్నట్టు విద్యాశాఖాధికారులు తెలిపారు. ఇక కామారెడ్డిలో మొత్తం మొదటి విడతలో 351 పాఠశాలలు ఎంపిక చేశారు. అందులో 16 మినహా 335 పాఠశాలల్లో పనులు ప్రారంభమయ్యాయి. ఈ 16 స్కూళ్లలో కోటికి పైగా నిధులు అవసరం ఉండటంతో పను లు ఇంకా ప్రారంభం కాలేదు. జిల్లాలో ఇప్పటికే నాలుగు పాఠశాలల ప్రారంబోత్సవం జరగగా.. మరో నాలుగు పాఠశాలలను ఈ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ప్రారంభి స్తున్నట్టు కామారెడ్డి జిల్లా విద్యాశాఖాధికారి రాజు తెలిపారు.

మన ఊరు-మన బడితో ప్రభుత్వ స్కూళ్లలో మౌలిక వసతులు మెరుగు పరిచిన తరువాత పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు, మెరుగైన విద్య అందించేందుకు తదుపరి చర్యలు చేపడతామని సర్కారు ఇప్పటికే ప్రకటించింది. నిజామాబాద్ జిల్లాలో మొత్తం 1234 స్కూళు ఉన్నాయి. ఇక కామారెడ్డిలో 1257 స్కూళ్లు ఉన్నాయి. దశలవారిగా పథకం పూర్తయితే ఈ స్కూళ్లకు మహర్దశ రానుంది.

దళితబంధుతో బంగారంలా బతుకులు

- జిల్లాలో 550 కుటుంబాలకు చేయూత
- రూ.55 కోట్లు మంజూరు

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి



రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న దళితబంధుతో దళితులు బతుకుల్లో చిరునవ్వుల వెదజల్లుతున్నాయి. గత పథకాలకు భిన్నంగా లబ్ధిదారుడి అభీష్టం మేరకే యూనిట్లు ఎంపిక చేసుకునేందుకు సర్కారు వెసులుబాటు ఇవ్వడంతో ఈ పథకానికి పెద్దఎత్తున డిమాండ్ పెరిగింది. మొదటి విడత దిగ్విజయంగా పూర్తి కావడంతో రెండో విడత ఎప్పుడా అని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. నిజామాబాద్ జిల్లాలో మొదటి విడతలో 550 మంది లబ్ధిదారుల కోసం సర్కారు రూ.55 కోట్లు కేటాయించింది.

రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ కుటుంబాల ఆర్థిక సాధికారత, సామాజిక అభ్యున్నతి కోసం ప్రభుత్వం దళిత బంధు పథకం ప్రవేశపెట్టింది. దళిత బంధు పథకంలో కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందిస్తారు. ఈ రూ.10 లక్షలు ధన రూపేణా కాకుండా లబ్ధిదారుల అనుభవం, నైపుణ్యం ఉన్న యూనిట్లను ఎంచుకోవాల్సి ఉంటుంది. ప్రతి నియోజక వర్గంలో 100 కుటుంబాల చొప్పున మొదటి విడతగా జిల్లాకు 550 కుటుంబాలకు దళిత బంధు పథకం వర్తింపచేశారు. బాల్కొండ నియోజకవర్గం-100, ఆర్మూర్ నియోజకవర్గం -100, నిజామాబాద్ (అర్బన్)-100, నిజామాబాద్ (రూరల్)-100, బోధన్-100, బాన్సువాడ -50 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఈ పథకంలో 550 యూనిట్లకు గాను ప్రభుత్వము రూ.55 కోట్లు విడుదల య్యాయి. ఈ రూ.55 కోట్లలో రవాణా రంగంలో (386) మంది లబ్దిదారులకు రూ.38.60 కోట్లు, రవాణేతర రంగాల్లో 164 మంది లబ్దిదారులకు రూ.16.40 కోట్లు ఖర్చు చేశారు.

రెండో విడత కోసం ఎదురుచూపులు..

మొదటి విడత దళిత బంధులో పెద్దఎత్తున లబ్ధిదారులు మిగిలిపోవడంతో సర్కారు రెండో విడత అమలుపై దృష్టి సారించింది. మార్చి నెలలో సమావేశమైన రాష్ట్ర కేబినెట్ రెండో విడత అమలుపై నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా 119 నియోజకవర్గాలకు గాను 118 నియోజకవర్గాల్లో లక్షా 30 వేల మందికి దళితబంధు అమలు చేయాలని సర్కారు నిర్ణయించింది. ప్రతి నియోజకవర్గానికి 1,100 మందికి నేరుగా పది లక్షల ఆర్థికసాయం చేయనుంది. ఈ లెక్కన జిల్లాకు రూ.110 కోట్లు ఖర్చు చేయనుంది. దీంతో పెద్దఎత్తున లబ్ధిదారులు ఆర్థికంగా బలోపేతం అయ్యే అవకాశముంది.

కేసీఆర్ కృషితోనే కుల గుర్తింపు

జాదవ్ శరత్, జర్నలిస్ట్,
ఓడ్ కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో సంచార ఓడ్ కుల గుర్తింపు సీఎం కేసీఆర్ కృషి వలనే సాధ్యమైంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఏడూ దశాబ్దాలుగా గుర్తింపుకు నోచుకోకుండా ఉన్న ఓడ్ కులంతో పాటు 16 కులాలను రెండేళ్ల క్రితం బిసి జాబితాలో చేర్చి సామాజిక న్యాయంతో పాటు ఆత్మ గౌరవాన్ని కల్పించిన ఘనత కేసిఆర్ కే దక్కుతుంది. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా కొత్తగా గుర్తింపు పొందిన 13 సంచార బీసీ కులాలను ఎంబిసీ జాబితాలో చేర్చి ఆర్థిక స్వాలంబన కల్పించి ఏడు దశాబ్దాల వెనుకబాటుకు ప్రత్యేక పథకాలతో సీఎం కేసీఆర్ సమచిత న్యాయం చేస్తారని భావిస్తున్నాను.

సొసైటీల ఏర్పాటుతో మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధి

- ప్రభుత్వ పరంగా ఉచితంగా చేప పిల్లల పంపిణీ
- జిల్లా మత్స్యశాఖాధికారి జీ. రాజనర్సయ్య

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



మత్స్యకారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందని జిల్లా మత్స్యశాఖాధికారి జీ. రాజనర్సయ్య తెలిపా రు. సొసైటీల ఏర్పాటుతో పాటు ఉచితంగా చేప పిల్లల పంపిణీతో వారు ఆర్థికంగా అభ్యున్నతి సాధిస్తున్నారని అన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని నవతెలంగాణతో ప్రత్యేకంగా మాట్లాడారు.

నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 353 ప్రాథమిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఏర్పాటు చేశాం. అందులోనూ పురుషుల మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు 257, మహిళా పారిశ్రామిక సహకార సంఘాలు 94 ఏర్పాటు చేశాము. చేపలను పెంచడంతో పాటు ప్రభుత్వం మత్స్య కారాలకు సహకారంగా ఉండే అందుకు జిల్లాలోని 986 చెరువులలో 458 లక్షల చేప పిల్లలను ప్రభుత్వం పంపిణీ చేసింది. అదేవిధంగా జిల్లాలో 29 చెరువులలో, ఒక రిజర్వాయర్ లో 82 లక్షల రొయ్య పిల్లలను పంపిణీ చేశాం. దీనికి తోడు రైతులు ఎవరైనా ముందుకు వచ్చి వారి వ్యవసాయ క్షేత్రంలో చెరువులను తవ్వుకొని చేపలను పెంపకం చేయుటకు 2021-22 సంవత్సరానికి 11 మంది లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నాం. అదేవిధంగా 2022-23 సంవత్సరానికి గాను 30 మంది రైతులు కొత్తచెరువులను తవ్వుకునేందుకు దరఖాస్తు చేసుకున్నారు. వారి చెరువులను పరిశీలించాం. ప్రభుత్వం నుండి ఎస్సీ, ఎస్టీ, బీసీ లకు 60 శాతం వరకు సబ్సిడీ అందనుంది. మిగతా వారికి 40 శాతం సబ్సిడీని అందజేస్తుంది.

8,9,10 తేదీల్లో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్

రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పాత కలెక్టరేట్ కార్యాలయం వద్ద జూన్ 8, 9, 10వ తేదీలలో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. అందులో చేపల వంటకాలు, వాటి రుచులు, వాటి ద్వారా కలిగే ఆరోగ్య ప్రయోజనాలు అనే అంశాలను తెలిపే విధంగా స్టాల్ ఏర్పాటు చేయనున్నాము.



చేపలు ఆరోగ్యానికి మేలు చేస్తుందని, చేపలు తినడం వల్ల ఆరోగ్యనికి మంచిది అనే విషయాన్ని వైద్య నిపుణులు అంటున్నారు. ఆరోగ్య అంశాలను తెలిసే విధంగా ప్రత్యేకంగా స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నాం.



డ్రాప్ అవుట్ విద్యార్థులను అడ్మిట్ చేయాలి

డీఈవో

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

విద్యార్థుల అడ్మిషన్లపై ప్రత్యేకంగా ప్రభుత్వం ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, అందుకు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు, అంగన్వాడి టీచర్లు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఎన్రోల్మెంట్ డ్రైవ్‌లో పాల్గొని డ్రాప్ అవుట్ అయిన విద్యార్థులను మళ్ళీ అడ్మిషన్లు పొందే విధంగా చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్వీ దుర్గా ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ఈనెల 3 నుండి 17 వరకు స్పెషల్ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించాలని పేర్కొన్నారు. 3 నుండి 9 వరకు విద్యార్థుల నమోదు కార్యక్రమం డోర్ టు డోర్ కార్యక్రమం నిర్వహించాలని పేర్కొన్నారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి



నవతెలంగాణ-రామారెడ్డి

విద్యుత్ షాక్ తో రైతు మృతి చెందిన ఘటన మండలంలోని మద్దికుంటలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మద్దికుంట గ్రామానికి చెందిన గజ్జల లింగం (40) తన పంట పొలంలో బోరు మోటార్ వద్ద విద్యుత్ షాక్కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య గజ్జల తుల్సవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేపట్టినట్టు ఏఎస్ఐ శుభాషిని తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సాగు విస్తీర్ణంలో విప్లవం

- మూడేండ్లలో 3 లక్షల ఎకరాలకు పెరిగిన సాగు
- రబీలోనూ రికార్డ్‌స్థాయిలో వరి దిగుమతి
- గతంలో పంటలు ఎండి పశువులను మేపిన రైతులు
- ఖరీఫ్‌లో 1.9 లక్షలు పెరిగిన వైనం
- నీటి లభ్యతతో పడావ్ భూముల్లో బంగారంలా పంటలు

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తరువాత ఈ దశాబ్దికాలంలో సాగు రంగంలో అనేక విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రధానంగా సాగు విస్తీర్ణం కనీవినీరితీలో పెరిగింది. 2016 సంవత్సరంతో పోల్చితే 2023 వరకు రబీ సాగులో ఏకంగా 2,98,070 ఎకరాల సాగు విస్తీర్ణం పెరగగా.. అదే ఖరీఫ్ సీజన్‌లో సాగు పరిశీలిస్తే.. 1,90,180 ఎకరాల్లో సాగు విస్తీర్ణం పెరిగింది. గతంలో రబీ సీజన్‌లో రైతులకు పంట చేతికి వచ్చే వరకు నమ్మకం ఉండేది కాదు. వరి సాగు చివరి దశకు వచ్చిన తరువాత భూగర్భ జలాలు అడుగంటి వరి పొలాల్లోకి పశువులను మేతకు తోలిన ఘటనలు కొకోల్లలు. కానీ రాష్ట్ర ప్రభుత్వం మిషన్ కాకతీయతో చెరువులు పునరుద్ధరించడం, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా కాలువల నుంచి నీటిని నిజాంసాగర్ అటు నుంచి శ్రీరామసాగర్‌కు జలాలను తరలించడంలో జిల్లాలో భూగర్భజలాలు పెద్దఎత్తున పునరుద్ధరించాయి. ఫలితంగా రబీలోనూ భూమిపండి పొంగినట్టు పెద్దఎత్తున వరి దిగుబడి వచ్చింది. ఖరీఫ్‌తో సమానంగా దాదాపు 10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అవడం విశేషం.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంపై ప్రత్యేకంగా దృష్టి సారించడంతో ఈ పదేండ్లకాలంలో పెద్దఎత్తున మార్పులు చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా రైతుబంధు పథకం ద్వారా పంట పెట్టుబడిసాయం అందచేయడంతో రైతుకు సాగులో చేదుడువాదోడుగా ఆర్థిక తోడ్పాటునందించాయి. ఫలితంగా పంట ఆరంభంలోనే అప్పులు చేసే పరిస్థితి నివారించినట్టయ్యింది. ఇక వ్యవసాయానికి సాగు నీరు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించింది. ఇప్పటికే నిజాంసాగర్ ప్రాజెక్టు ప్రధాన, ఉపకాలువల ఆధునీకరణలకు రూ.954.77 కోట్లు మంజూరు చేయగా.. ఇప్పటి వరకు రూ.413.15 కోట్లు ఖర్చు చేసింది. పైగా మిషన్ కాకతీయ ద్వారా జిల్లాలో 1270 చెరువులను పునరుద్ధరించాలని నిర్ణయించగా.. 751 చెరువుల పునరుద్ధరణ వంద శాతం పూర్తి చేసింది. మరో 90 చెరువుల మరమ్మతు పనులు పురోగతిలో ఉన్నాయి. ఈ చర్యల ఫలితంగా జిల్లాలో సాగునీటి లభ్యత పెరిగింది.

పెరిగిన సాగు విస్తీర్ణం...

జిల్లాలో నీటి లభ్యత లేక పడావుగా ఉన్న భూముల్లో ప్రస్తుతం రైతులు బంగారు పంటలు పండిస్తున్నారు. ఇందుకు నిదర్శనం జిల్లాలో పెరిగిన సాగు విస్తీర్ణమే చెబుతోంది. 2015-16 యేడాదిలో రబీ సీజన్‌లో మొత్తం 2,03,900 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఇందులో కేవలం 60 వేల ఎకరాల్లో మాత్రమే వరి సాగు అయ్యింది. కానీ 2022-23 యేడాదిలో జిల్లాలో 5,01,970 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఇందులో వరి ఏకంగా 4,00,414 ఎకరాల్లో సాగవడం విశేషం. కేవలం ఐదేండ్లలో 2,98,070 ఎకరాల్లో సాగు విస్తీర్ణం పెరిగింది. సాధారణంగా రబీలో కేవలం బోరుబావుల ఆధారంగా మాత్రమే పంటలు సాగయ్యే పరిస్థితి నుంచి కాలువులు, చెరువుల కింద కూడా పంటలు సాగయ్యే స్థితికి నేడు జిల్లా చేరింది. ఇక ఖరీఫ్ సీజన్ సాగులోనూ పెద్దఎత్తున మార్పు జరిగింది. 2016 యేడాదిలో జిల్లాలో ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం 3,23,176 ఎకరాలు కాగా.. ప్రస్తుతం 2022 యేడాదిలో ఏకంగా 5,12,738 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఇక ఈ యేడాది 2013లో జిల్లాలో 5,13,356 ఎకరాల్లో పంటలు సాగయ్యే అవకాశమున్నట్టు వ్యవసాయశాఖ అధికారులు అంచనాలు వేశారు. ఒకవేళ నైరుతిలో ముందుగానే వానలు జోరందుకుంటే.. సాగు విస్తీర్ణం మరో పది వేల ఎకరాలు పెరిగే అవకాశముంది.



కామారెడ్డి ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీకి స్వయం ప్రతిపత్తి హోదా



కామారెడ్డిలోని అర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి లోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఈ విద్యా సంవత్సరం నుంచి స్వయం ప్రతిపత్తి (autonomous) హెూదా పొందింది. ఈ మేరకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. స్వయం ప్రతిపత్తి హెూదా పొందడంతో కళాశాల మినీ విశ్వవిద్యాలయంగా మారే అవకాశం పొందింది. అలాగే యూజీసీ నిధులు, కొత్త కోర్సులు పెరుగుతాయి. విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది. పరీక్ష విధానం, నిర్వహణ కళాశాలలోనే జరగనుంది. కళాశాలకు లభించిన స్వయం ప్రతిపత్తి హెూదా 10 సంవత్సరాల పాటు అమలులో ఉంటుంది. ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల గత ఆరు నెలల క్రితం న్యాక్ ఏ గ్రేడ్ అత్యుత్తమ పాయింట్లతో పొంది, ఆటనమస్ కొరకు దరఖాస్తు చేసుకుంది. ఈ మేరకు ఆటోనమస్ హెూదా మంజూరు చేస్తూ ఈరోజు యు జి సి ఉత్తర్వులు జారీ చేసింది.

సమిష్టి కృషి వల్లనే తమ కళాశాల స్వయం ప్రతిపత్తి హెూదా పొందింది అని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే. కిష్టయ్య తెలిపారు. 60 ఏండ్ల కాలేజీ చరిత్రలో ఇది ముఖ్యమైన మైలురాయి అన్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులు సిబ్బంది, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు పరస్పరం అభినందనలు తెలుపుకున్నారు.

దశాబ్ది ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలి

- ఎమ్మెల్యే షకీల్ ఆమేర్



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే షకీల్

నవతెలంగాణ-బోధన్

తెలంగాణ ప్రభుత్వం జూన్ రెండవ తేదీ నుంచి 23వ తేదీ వరకు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల వేడుకలను అధికారులు ఘనంగా నిర్వహించాలని బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ అధికారులకు ఆదేశించారు. గురువారం తన నివాసంలో బోధన్ నియోజకవర్గం ప్రజాప్రతి నిధులతో, అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 21 రోజులపాటు నిర్వహించే దశాబ్ది ఉత్సవాలలో ప్రతి గ్రామంలో ప్రభుత్వ కార్యాలయాలను ముస్తాబు చేసి అంగరంగ వైభవంగా నిర్వహించాలని సూచించారు. ప్రజలను కార్యక్రమాలలో భాగస్వాములు చేసి ప్రభుత్వం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలను ముందుకు కొనసాగించాలని పేర్కొన్నారు. సమావేశంలో ఆర్డీఓ రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, వ్యవసాయ శాఖ ఇన్చార్జ్ ఏడీఏ సంతోష్, ఏఎంసీ చైర్మన్ వీఆర్ దేశాయ్, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు బుద్దె రాజేశ్వర్, నక్క లింగారెడ్డి, సాలూర మండల అధ్యక్షులు నర్సయ్య, ఎడపల్లి ఎంపీపీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు లింగాయత్ సభ్యుల సన్మానం..

బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమెర్‌కు సాలూర మండల లింగాయత్ సమాజ్ కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యే నివాసంలో గురువారం మర్యాదపూర్వకంగా కలుసుకొని శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు శంకర్, గడ్డం గంగులు, సురేష్, శంకర్ పటేల్ తదితరులున్నారు.

ఫ్యాకేజ్ 21తో 80 వేల ఎకరాలకు సాగునీరు

- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



పనులు పరిశీలిస్తున్న మంత్రి వేముల

నవతెలంగాణ-భీంగల్

బాల్కొండ నియోజక వర్గంలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాలైన భీంగల్, వేల్పూర్, కమ్మర్‌పల్లి , మోర్తాడ్ మండలాలకు ఫ్యాకేజ్ 21 ద్వారా నీరు 80 వేల ఎకరాలకు చేరుతుందని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని బడా భీంగల్ పరిసర ప్రాంతంలోని కప్పల వాగులో నగుడుస్తున్న ప్యాకేజ్ 21 పనులను స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. నియోజకవర్గంలోని రైతులకు నీరందించేందుకు కంకణం కట్టుకొని సీఎం కేసీఆర్ చొరవతో 1350 కోట్లతో ప్యాకేజ్ 21 పనులు చేపట్టామని త్వరలోనే 4 ఎకరాలకు ఒక వుట్ (బోరు) పెట్టినీళ్లందించనున్నట్టు తెలిపారు. అంతకు ముందు రెండు వాగులోని చెక్‌డ్యాంలను ఈ నీటితో నింపనున్నట్లు మంత్రి తెలిపారు. పచ్చలనడుకుడ, చేంగల్, బడా భీంగల్ గ్రామాలలోని రైతుల పొలాలో పైప్‌లైన్‌లు వేశామని, మిగతా గ్రామాల రైతులు కూడా సహకరించాలని మంత్రి కోరారు. మంత్రి వెంట యంపిపి ఆర్మూర్ మహేష్, జెడ్పీటీసి చౌట్‌పల్లి రవి, పార్టీ మండల అధ్యక్షుడు దొనకంటి నర్సయ్య, సర్పంచ్ సంజీవ్ మరియు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలి

- బాధ్యతలనుండి తొలగించాలి : ప్రజాసంఘాల డిమాండ్
- రెజ్లర్లకు మద్దతు తెలుపుతూ ఎంపీ దిష్టిబొమ్మ దహనం



బీజేపీ ఎంపీ దిష్టిబొమ్మ దహనం చేసి నినాదాలు చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

మహిళా రెజ్లర్ల పై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ భూషణ్ సింగ్ ను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపుమేరకు బుధవారం ప్రజాసంఘాల నాయకులు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్ వద్ద బ్రిజ్ భూషణ్ సింగ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్.కె.ఎం) జిల్లా భాద్యులు వి.ప్రభాకర్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎస్కేఎం జిల్లా బాధ్యులు వి.ప్రభాకర్, సిఐటియు జిల్లా భాద్యులు రమేష్ బాబు, రైతు సంఘ బాధ్యులు కే. రాజన్న, ఏఐపికెఎస్ రాష్ట్ర కార్యదర్శి బి.దేవారం, ఐఎఫ్టియు జిల్లా సహాయ కార్యదర్శి శివకుమార్, ఏఐకెఎంఎస్ జిల్లా బాధ్యులు గంగాధర్ లు మాట్లాడారు. ఢిల్లీలో మహిళా రెజ్లర్లపై కేంద్ర పోలీసు బలగాల నిర్బంధాన్ని, ధమనకాండను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. క్రీడాకారిణిలపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ, భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షులు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను తక్షణమే అరెస్టు చేయాలని, బాధ్యతల నుండి తొలగించి, చట్టరీత్యా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షు లుగా కొనసాగుతున్న బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ పై గతంలోనే అనేక కేసులు, ఫిర్యాదులు ఉన్నాయని అన్నారు. క్రీడాకారులపై బహిరంగంగానే వివాదాస్పదంగా ప్రవర్తించిన ఘటనలు ఉన్నాయని తెలిపారు. రెజ్లింగ్ మహిళా క్రీడాకారినిలపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని, క్రీడాకారులను శారీరకంగా హింసించాడని, బెదిరింపులకు పాల్పడ్డాడని, బ్రిజ్ భూషణ్‌ను శిక్షించాలని భారత రెజ్లింగ్ క్రీడాకారులు ఢిల్లీ జంతర్ మంతర్ వేదికగా ప్రజాస్వామ్య యుతంగా ఉద్యమిస్తున్నారని అన్నారు. ఇంత జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం భారత ప్రధాని, క్రీడాశాఖ మంత్రులు కనీసం స్పందించకపోవడం సిగ్గుచేటని అన్నారు. రెజ్లింగ్ క్రీడాకారులు ఒలంపిక్స్, ప్రపంచ కప్ మొదలగు పోటీల్లో భారతదేశానికి పథకాలు తీసుకొచ్చినప్పుడు తమ ప్రభుత్వం గొప్పగా చెప్పుకొని, క్రీడాకారులతో ఫోటోలు దిగిన ప్రధాని మోడీ, క్రీడా మంత్రులు ఇప్పుడు మొహం చాటేయడం అనైతికం అని అన్నారు. ఒకవైపు బేటి పడావో బేటి బచావో అని మనకి బాత్ చెప్పున్న ప్రధాని నరేంద్ర మోడీ, మహిళా క్రీడాకారులు దేశ రాజధానిలో ఇన్ని రోజులుగా నిరసన చేస్తుంటే వారితో మాట్లాడడం గాని, మంత్రుల ద్వారా చర్చించడం గాని చేయకపోవడం దుర్మార్గమని అన్నారు. మహిళా క్రీడాకారులపై లైంగిక వేధింపులకు పాల్పడిన భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షులు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ ను తక్షణమే సమాఖ్య బాధితుల నుంచి తొలగించాలని, అతన్ని చట్టరీత్యా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐపికెఎస్ జిల్లా అధ్యక్షులు ఎస్. సురేష్, ఏఐకెఎస్ జిల్లా అధ్యక్షులు పి.వెంకటేష్, ఐఎఫ్టియు జిల్లా ప్రధానకార్యదర్శి ఎం.సుదాకర్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్, జిల్లా ఉపాధ్యక్షులు గోవర్దన్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు నర్సింగ్ రావు, ఐద్వా జిల్లా అధ్యక్షులు సుజాత, ఏఐపికేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయగౌడ్, ఏఐకెఎస్ జిల్లా అధ్యక్షులు పి.వెంకటేష్, పివైఎల్ జిల్లా అధ్యక్షులు బి.కిషన్, పిడిఎస్యు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.నరేందర్, కే.గణేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం, పిడిఎస్యు జిల్లా కార్యదర్శి రాజేశ్వర్, వివిధ రైతు ప్రజాసంఘాల నాయకులు ఎం.వెంకన్న, పి.నాగన్న, పి.రాజేశ్వర్, గంగాధర్, అనిత, రాజన్న, నారాయణ, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఇందూరు సిగలో ఐటీ హారం



- ఐటీ హబ్ పనులు పూర్తి
- ఈ నెలలో ప్రారంభించే అవకాశం
- ఇప్పటికే పలు కంపెనీలతో ఒప్పందాలు పూర్తి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలో అత్యాధునిక హంగులతో ఐటీ హబ్ భవన నిర్మాణం పూర్తయింది. ఈ నెలలో ఐటీ మంత్రి కేటీఆర్ ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. టీఎస్ ఐఐసీ (తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇనఫ్రాస్ట్రక్చర్ కార్పోరేషన్) లిమిటెడ్ ఆధ్వర్యంలో కంఠేశ్వర్ బైపాస్‌రోడ్డుపై సమీకృత కలెక్టరేట్ సముదాయానికి పక్కనే మూడున్నర ఎకరాల సువిశాల విస్తీర్ణంలో నిర్మించిన ఐటీ టవర్ విశేషంగా ఆకట్టుకుంటుంది. అత్యాధునిక పద్ధతుల్లో ఐటీ కంపెనీలకు అనువైన వాతావరణం ఉండే విధంగా నిర్మాణాలను చేపడుతున్నారు. గ్రీన్ బిల్డింగ్ కాన్సెప్ట్ ప్రకారం తక్కువ విద్యుత్ ఖర్చుతో ఎక్కువ వెలుతురును సహజ సిద్ధంగానే పొందే విధంగా నిర్మాణాలను చేపడుతున్నారు. ఐటీ టవర్ నిర్మాణాన్ని ప్రతి దశలోనూ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యే గణేష్ గుప్తా చొరవతో నిజామాబాద్ నగరంలో ఐటీ ఐటీ రంగంలో ఉద్యోగాలు దక్కే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది.

తరలిరానున్న ఐటీ కంపెనీలు

రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుంటున్న ఐటీ కంపెనీలు తమ వ్యాపార సామ ర్థ్యాన్ని పెంచుకుంటున్నాయి. అంతర్జాతీయ కంపెనీలకు దేశంలో హైదరాబాద్ మాత్రమే అనువైన ప్రాంతంగా మారుతుండడంతో మన రాజధాని ఐ టీ హబ్ గా వెలుగులీనుతోంది. తరలివస్తున్న భారీ పెట్టుబడులను రాష్ట్ర ప్రభుత్వం ముందు చూపుతో ఇతర జిల్లాలకు తరలిస్తోంది. మెట్రో నగరమైన హైదరాబాద్లోనే ఐటీ వ్యవస్థీకృతం అవుతున్న నేపథ్యంలో నిజామాబాద్ వంటి ద్వితీయ శ్రేణి నగరాలకు సైతం ఐటీ కంపెనీలను తీసుకువస్తున్నారు. ఇందుకోసం మంత్రి కేటీఆర్ తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఇందులో భాగంగా నిర్మిస్తున్న ఐటీ హబ్ ఈ నెలలో మంత్రి కేటీఆర్ ప్రారంభించనున్నట్టు ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్త తెలిపారు.

ఐటీ టవర్ విశేషాలివీ...

ప్రభుత్వ భూమిని ఐటీ టవర్ నిర్మాణానికి కేటాయించారు. పరిపాలన భవనం కలెక్టరేట్ ఈ ప్రాంతంలోనే నిర్మించడం, ఇతరత్రా ముఖ్యమైన భవన నిర్మా తాలు ఇక్కడ జరుగుతుండడంతో ఐటీ టవర్ను సైతం ఇక్కడే నెలకొల్పారు. నిజామాబాద్ నగరాభివృద్ధిని అంచనా వేసుకుని ఈ ప్రాంతాన్ని ఎంపిక చేశారు. రూ.25కోట్లు ప్రభుత్వం మంజూరు చేయడంతో 2018, ఆగస్టు 1వ తారీఖు రోజున భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రాష్ట్ర పరిశ్ర మలు, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఐటీ టవర్ను సువిశాలంగా నిర్మిస్తు న్నారు. మొత్తం 49,480 చదరపు అడుగుల విస్తీ ర్ణంలో నిర్మాణాన్ని చేపడుతున్నారు. గ్రౌండ్ ఫ్లోర్తో కలుపుకొని మూడు అంతస్తులతో ఈ నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఎకరం భూమిలో ఐటీ టవర్ను డిజైన్ చేశారు. మిగిలిన 2.5 ఎకూల భూమిని భవిష్యత్తులో ఐటీ టవర్ విస్తరించేలా ప్రాణళికతో రూపొందించారు. ప్రస్తుతం పార్కింగ్, లాన్, ఇతర సౌకర్యాల కల్పనకు ఈ ఖాళీ భూమిని వాడుతున్నారు.

8 కంపెనీలతో ఒప్పందాలు

మంత్రి కేటీఆర్ అమెరికా పర్యటనలో భాగంగా జరిగిన సమావేశంలో 100 కంపెనీల సీఈఓ లతో మంత్రి కెటిఆర్ భేటీ అయ్యారు. నిజామాబాద్ లాంటి ద్వితీయ శ్రేణి పట్టణాల్లో ఐటీ పరిశ్రమ అభివృద్ధికి తమ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల గురించి వివరించడంతో పాటు ఇక్కడ ఉన్న అనుకూలతలు, తాము కల్పించిన మౌలిక వసతులపై మాట్లాడారు. దీంతో నిజామాబాద్ ఐటీ హబ్‌లో 8 ఐటీ కంపెనీల ప్రతినిధులు నిజామాబాదు ఐటి హబ్ లో కార్యకలాపాలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వంతో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు.

ఈ నెలలోనే ప్రారంభం

అర్బన్ ఎమ్మెల్యే బీగాల గణేష్ గుప్తా

నిజామాబాద్ నగరంలోని ఐటీ టవర్ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. భవన నిర్మాణం వంద శాతం పూర్తయ్యింది. మిగిలిన పనులు వేగంగా జరుగుతున్నాయి. అతి త్వరలో ఈ నెలలోనే ఐటీ హబ్‌ను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. మంత్రి కేటీఆర్ రానున్నారు. ఐటీ హబ్ ప్రారంభంతో ద్వితీయ శ్రేణి నగరంగా ఉన్న నిజామాబాద్.. ఐటీ నగరంగా మారనుంది.



ఏర్పాట్లు పరిశీలించి సూచనలిస్తున్న ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్త

15 వరకు రెన్యువల్, ఫ్రెష్ ఉపకార వేతనాల కొరకు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-కంటేశ్వర్

2022 2023 విద్యా సంవత్సరంలో జిల్లాలోని వివిధ కళాశాలలో చదువుచున్న అర్హులైన యస్సీ, బిసి, ఎస్టీ, మైనారిటీ విద్యార్థిని, విద్యార్థులు రెనివల్, ఫ్రెష్ ఉపకారవేతనాల కోసం http://telanganaepass.cgg.gov.in వెబ్ సైట్ నందు ఆన్లైన్ ద్వారా ధరఖాస్తు చేసుకొనుటకు ఈనెల 1నుండి 15 వరకు పొడగించినట్టు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

అధ్యాపకులకు సన్మానం

నవతెలంగాణ-ధర్పల్లి



మండల కేంద్రములో ప్రభుత్వ కళాశాల గురువారం ప్రారంభమైన సందర్భంగా ప్రిన్సిపాల్ రజీయొద్దీన్ అస్లాం కళాశాలలోని పలువురు కాంట్రాక్టర్ అధ్యాపకులతోపాటు రెగ్యులర్ అధ్యాపలకును సన్మానించారు. నూతన విద్యాసంవత్సరం ప్రారంభం సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపి శాలువాలతో సన్మానం చేశారు. అనంతరం విద్యాభ్యాసం పట్ల పలుసూచనలు చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఖమర్ సర్, విట్టల్, తదితరులు పాల్గొన్నారు.

కుర్‌కురే ప్యాకెట్లు అమ్మిస్తున్న

దేశాయ్ బీడీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

- **సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్**

వతెలంగాణ-కంటేశ్వర్

కురుకురే ప్యాకెట్లు కొంటేనే కార్మికులకు ఆకు తంబాకు వేస్తామని కార్మికులను బెదిరిస్తున్న దేశాయి బీడీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తెలంగాణ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్(సిఐటీయూ) ఆధ్వర్యంలో తెలంగాణ బీడీ, టొబాకో మ్యానుఫ్యాక్చర్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. దేశాయి బీడీ ఫ్యాక్టరీ వారు కురుకురే స్నాక్స్ తయారుచేస్తున్నారని, దాని మార్కెటింగ్‌కు బీడీ కార్మికులను బలవంతంగా వినియోగిస్తున్నారని తెలిపారు. బీడీ కార్మికులకు ఆకు, తంబాకు వేసేటప్పుడు కురుకురే ప్యాకెట్లను అమ్మి (ఒక్కొక్క ప్యాకెట్టు ఖరీదు ఐదు రూపాయలు చొప్పున) డబ్బు తీసుకురావాలని టేకేదారులు బలవంతంగా అప్పజెప్పున్నారని చెప్పారు. వ్యతిరేకించే వారిపై కక్ష సాధిస్తున్నారని, బట్వాడా చేసేటప్పుడు ప్యాకెట్ల డబ్బును మినహాయించుకుని వేతనం చెల్లిస్తున్నారని అన్నారు.. ఒక్కొక్క కార్మికుని వద్దనుండి 300 నుండి 500 వరకు డబ్బులను మినహాయించుకొని పేమెంట్ చేస్తున్నారని తెలిపారు. బీడీ కార్మికులను ఆ బాధ్యత నుంచి తప్పించే విధంగా యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మి, సుజాత, ధనలక్ష్మి, విమలమ్మ, పద్మ, వసంత, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ందజేస్తున్న నాయకులు

గోడ కూల్చి... రోడ్డు వేసి..



నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నగరంలోని జెడ్పీ చౌరస్తా ఇటు పక్కన జిల్లా పరిశ్రమల కేంద్రం, అటుపక్కన ఇన్కం ట్యాక్స్ ఆఫీస్ ఉంది. ఆ రెండింటికి కలుపుతు ఉన్న ప్రహరీ గోడను ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు, జిల్లా పరిశ్రమల కేంద్రంకు సంబంధించిన ప్రహరీ గోడను కూల్చివేసి మొరం వేసి రోడ్డును వేశారు. దీంతో స్థానికుల ఆశ్చర్యానికి గురయ్యారు. ఇది ప్రభుత్వ స్థలమా లేక ప్రైవేటు వారి స్థలాన్నే ప్రభుత్వం వారు ఉపయోగించుకున్నారా అనే సందేహం వ్యక్తంచేస్తున్నారు. ఈ రోడ్డు ఎందుకు వేశారు.. ఎవరు అనుమతి పోందారు.. రోడ్డు వేయవలసిన అవసరం ఎందుకు వచ్చింది.. ఈ రోడ్డు ఎవరి ప్రయోజనాల కోసం అని స్థానికులు అంటున్నారు.

తెలంగాణ అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి, కలెక్టర్

నవతెలంగాణ-కంతేశ్వర్/నిజామాబాద్ సిటీ

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర రోడ్లు - భవనాలు, గృహ నిర్మాణ, శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అలుపెరుగని పోరాటాలు, అనేక త్యాగాల ఫలితంగా ఆరు దశాబ్దాల ఉద్యమ ప్రస్థానంతో సాధించుకున్న స్వరాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వ పాలన కొనసాగుతోందని పేర్కొనారు. ఇంటింటికి రక్షిత మంచినీరు, సాగు జలాలు, సేద్యానికి 24 గంటల విద్యుత్ సరఫరా, రైతుబంధు, రైతు బీమా, ఆసరా పెన్షన్లు వంటి అనేక సంక్షేమాభివృద్ధి కార్యక్రమాల అమలులో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. పల్లె, పట్టణ ప్రగతితో గ్రామగ్రామాన పరిశుభ్రత, పచ్చదనం వెల్లివిరుస్తూ వరుసగా జాతీయ అవార్డులు వరిస్తుండడం తెలంగాణ ప్రగతికి ప్రామాణికంగా నిలుస్తోందని పేర్కొన్నారు. గడిచిన తొమ్మిదేళ్ల స్వల్ప వ్యవధిలోనే అనితరసాధ్యమైన అభివృద్ధి, సంక్షేమాన్ని ఆచరణాత్మకంగా నిరూపించిన తెలంగాణ ప్రభుత్వం, ఇదే స్ఫూర్తితో మరింత సమర్థవంతమైన పాలన దిశగా ముందుకెళ్లాలనే సంకల్పంతో దశాబ్ది ఉత్సవాలను చేపడుతోందని తెలిపారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం స్ఫూర్తితో రాష్ట్ర ప్రగతిలో సబ్బండ వర్గాలు మమేకమవుతూ, దశాబ్ది ఉత్సవాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

జీఆర్‌టి జ్యువెలర్స్ ప్రారంభం



నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ నగరంలోని నూతనంగా జ్యువెలరీ షోరూంని గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జీఆర్టి జ్యువెలర్స్ మేనేజింగ్ డైరెక్టర్ 'ఆనంద్' అనంతపద్మనాభన్ మాట్లాడుతూ.. 58వ సరికొత్త షోరూమ్ ను ప్రారంభించడన్ని ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందని అన్నారు. అద్భుతమైన ఆభరణాలు గోల్డెన్ మేనర్ బంగారం, డైమండ్, ప్లాటినం, వెండి, అరుదైన రత్నాలతో అనేక రకాల అద్భుతమైన ఆభరణాలను ఉన్నాయని తెలిపారు. బంగారు ఆభరణాల కొనుగోలుపై, పాత బంగారం మార్పిడిపై గ్రాముకు రూ.50 తగ్గింపు, డైమండ్, అన్కట్ డైమండ్ విలువపై 10 శాతం తగ్గింపు, వెండి వస్తువుల మేకింగ్ ఛార్జీలపై 25 శాతం, వెండి ఆభరణాల ఎంఆర్పిపై 10 శాతం తగ్గింపు లభిస్తుందని అన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ జీ.ఆర్. రాధాకృష్ణన్ మాట్లాడుతూ వినియోగదారుల నమ్మకాన్ని దృష్టిలో ఉంచుకొని విశాలమైన పార్కింగ్ స్థలం, విఐపి గదులు, వాలెట్ పార్కింగ్, పిల్లల సంరక్షణ గదిని అందుబాటులో ఉంచామని తెలిపారు. కస్టమర్ల జీవితంలో మరింత మంచి క్షణాలను సృష్టించడానికి ఎల్లప్పుడూ కృషి చేస్తామని, విశ్వాసం, స్వచ్ఛత విలువలపై నిర్మితం చేస్తామని అన్నారు.

పేదల అభ్యున్నతికి పాటుపడే తెలంగాణ కావాలి

ప్రముఖ పారిశ్రామికవేత్త పైడి రాకేష్ రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

ప్రముఖ పారిశ్రామిక వేత్త, నైన్ స్టార్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ పైడి రాకేశొరెడ్డి బీజేపీ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఢిల్లీలో గురువారం తెలంగాణ బీజేపీ పార్టీ ఇన్చార్జి తరుణ్ చుగ్ సమక్షంలో పార్టీలో చేరారు. బీజేపీ పార్టీ కండువా కప్పిన తరుణ్ చుగ్ రాకేశొరెడ్డిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. . ఈ సందర్భంగా రాకేశొరెడ్డి మీడియాతో మాట్లాడారు. సబ్బండవర్గాలు ప్రాణాలొడ్డి తెలంగాణ సాధించుకున్నది.. కుటుంబ పాలన కోసం కాదన్నారు. ఇది దొరల తెలంగాణ అని, బడుగు, బలహీనవర్గాల, పేదల అభ్యున్నతికి పాటుపడే తెలంగాణ కావాలని ఆయన ఆకాంక్షించారు. కచ్చితంగా తన రాజకీయ ఆరంగేట్రం పేద, బడుగు, బలహీనవర్గాలు, పీడిత వర్గాల పక్షాన నిలబడి కలబడే విధంగా ఉంటుందని తెలిపారు. మోడీని ఆదర్శంగా తీసుకుని తన రాజకీయ జీవితంలో ప్రజల వద్ద ప్రత్యేక గుర్తింపు పొందుతానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికే పేదలకు ఒక్క రూపాయికే కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తున్నానని, ఆపదలో ఉన్నవారికి పైడి రాకేశొరెడ్డి ఫౌండేషన్ ద్వారా ఆర్థికంగా, అన్ని రకాలుగా ఆదుకుంటున్నామని అన్నారు. అందరికీ అందుబాటులో ఉండి ఆర్మూర్ ఫ్యాక్షన్ రాజకీయాలను కూకటి వేళ్లతో పెకిలిస్తానని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఎంపీ అరవిందు,, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ కండువా వేసుకున్న రాకేశ్‌రెడ్డి

తానాకుర్దులో కంటివెలుగు ప్రారంభం



కంటివెలుగు ప్రారంభించిన సర్పంచ్

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని తానకుర్దు గ్రామంలో సర్పంచ్ లతా భూషణ్ కంటి వెలుగు కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగును గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయితీ కార్యదర్శి ధీరజ్ గ్రామ కారోబార్ అరుణ్ మరియు గ్రామ కమిటీ విలేజ్ అధ్యక్షుడు అంగలి సాయినాథ్ రెడ్డి, చిరంజీవి, బుజేందర్, అంచ మహేష్, రాణి , మరియు ఆశ వర్కర్లు, తదితర గ్రామ ప్రజలు పాల్గొన్నారు

యూత్ డిక్లరేషన్ ఇంటింటా ప్రచారం చేయాలి

నవతెలంగాణ-కంతేశ్వర్

కాంగ్రెస్ భవన్‌లో నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కేశ వేణు ఆధ్వర్యంలో నిజామాబాద్ నగర కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, పిసిసి ఉపాధ్యక్షులు తాహెర్ బిన్ హందాన్, పిసిసి ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్, యూత్ కాంగ్రెస్ ఇంఛార్జి రమేష్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మానాల మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయాలని, ఇందుకు ప్రియాంక గాంధీ చేసిన యూత్ డిక్లరేషన్‌ను ఇంటింటికి ప్రచారం చేయాలని ఆయన తెలిపారు. డివిజన్ కమిటీలను నియమించి క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడం ద్వారా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి దోహదపడుతుందని, ప్రతి డివిజన్‌లో కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. జూన్ రెండున తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన సోనియా గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి జాతీయ జెండా ఎగురవేయాలని అన్నారు. నిజామాబాద్ నగరంలో 500 బైక్లతో ర్యాలీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కేశ వేణు మాట్లాడుతూ...ఈనెల 18న రాజీవ్ గాంధీ ఆన్లైన్ క్విజ్ కాంపిటీషన్ నిర్వహించడం జరుగుతుందన్నారు. జూన్ 17వ తేదీ వరకు 7661899899 ఈ నెంబర్కు మిస్ కాల్ ఇవ్వడం ద్వారా వచ్చిన వెబ్ లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. డివిజన్ కమిటీలను పార్టీ కోసం పనిచేసే ఉత్సహవంతమైన కార్యకర్తలతో 21 మందితో నియమించాలని, ప్రతి బూత్ కమిటీలను ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పాలించిన సమయంలో ఎంచేసిందని బిజెపి , టిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతున్నారని, కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు దేశాన్ని విచ్చిన్నం కాకుండా చూసిందని, బీఆర్ఎస్ ప్రాంతీయ సెంటిమెంటు తో, బిజెపి పార్టీ మత పరమైన రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఉపధ్యక్షుడు రమర్తి గోపి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు విక్కీ యాదవ్, జిల్లా ఎన్ఎస్‌పి అధ్యక్షులు వేణు రాజ్, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విపుల్ గౌడ్, జిల్లా ప్రచార కమిటీ చైర్మన్ జావేద్ అక్రమ్,జిల్లా ఓ బి సి అధ్యక్షులు రాజ నరేందర్ గౌడ్, పిసిసి కార్యదర్శి రామ కృష్ణ,సీనియర్ కాంగ్రెస్ నాయకుడు రత్నాకర్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అబుధ్ బిన్ హందం, కార్పొరేటర్ రోహిత్, డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

నిజామాబాద్ నగర కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో మానాల మోహన్‌రెడ్డి



నేడు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-ముప్కాల్

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం ఉదయం 8 గంటల 30 నిమిషాలకు తహశీల్దార్ కార్యాలయం ముందు జాతీయ జెండా పతాక వందన కార్యక్రమం చేపట్టనున్నట్లు తహశీల్దార్ పి.శ్రీకాంత్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని ప్రభుత్వ ప్రయివేటు కార్యాలయాలలో జాతీయ జెండాను ఆవిష్కరించనున్నట్లు అధికారులు తెలిపారు. పార్టీ కార్యాలయం ముందు జెండాను ఆవిష్కరించడం జరుగుతుందని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ముస్కు భూమేశ్వర్ రెడ్డి తెలిపారు. పార్టీ శ్రేణులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు..

దశాబ్ది ఉత్సవాలు విజయవంతం చేయండి

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు నేటి నుంచి ఈ నెల 22 వరకు అట్టహాసంగా నిర్వహించడం జరుగుతుందని ఎంపీపీ సామ పద్మ-వెంకట్ రెడ్డి, జడ్పీటీసీ సభ్యులు బద్దం నర్సవ్వ-నర్సారెడ్డిలు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. దశాబ్ది ఉత్సవాల్లో మండల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, యువజన సంఘం నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

టీయూపై ప్రభుత్వం దృష్టి సారించాలి

- **టీవీయూవీ, ఏఐఎస్‌బీ**

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

తెలంగాణ యునివర్సిటీ (టియు) పై ప్రభుత్వం దృష్టి సారించాలని టివియువి రమావత్ లాల్ సింగ్ అన్నారు. తెలంగాణ యూనివర్శిటీ పాలనపై ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని, నిజామాబాద్ జిల్లా కేంద్రంలో గురువారం టివియువి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమావత్ లాల్ సింగ్, ఎఐయస్‌బి రాష్ట్ర ఉపాధ్యక్షులు మహేష్ రెడ్డి మాట్లాడుతూ వీసీ, ఈసిలు యూనివర్శిటీ అభివృద్ధి కోసం పని చేయాల్సింది పోయి యూనివర్శిటీ ప్రతిష్టను దెబ్బ తీస్తున్నారని తెలిపారు.యూనివర్శిటీ కి రిజిస్ట్రార్ లేక యూనివర్శిటీ పరిధిలోని డిగ్రీ, పి.జి కళాశాలల తనిఖీలు నిర్వహించి కళాశాలల అనుమతులు ఇవ్వకుండా వీసి, ఈసి, రిజిస్ట్రార్ నియామకంపై మొండి పట్టు వెనుక ఆంతర్యమేమిటో అని ప్రశ్నించారు. రెండు సంవత్సరాల కాలంలోనే ఆరుగురు రిజిస్ట్రార్‌లను నియమించి నేడు యూనివర్శిటీ విసి, ఈసి మొండి పట్టుతో రిజిస్ట్రార్ ఎవరు అనేది తేల్చకుండా యూనివర్శిటీ పాలనను గాలికి వదిలేశారని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే పూర్తి స్థాయిలో రిజిస్ట్రార్ ను నియమించి యూనివర్శిటీ పాలనను గాడిలో పెట్టాలని అని అన్నారు. యూనివర్శిటీలో అవినీతి అక్రమాలు జరిగితే ప్రభుత్వం అధికారులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వం తెలంగాణ యూనివర్శిటీపై సవతి తల్లి ప్రేమను చూపిస్తే ప్రభుత్వం పై ఉద్యమ కార్యాచరణ ను ప్రకటిస్తామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న నాయకులు

నేడు జెండా ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నందు నేడు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ పతాకావిష్కరణ ఎంపీపీ పస్కా నరసయ్య అధ్యక్షతన ఉంటుందని మండల అభివృద్ధి అధికారి శ్రీనివాస్ గురువారం తెలిపారు. సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

5 నుంచి మధ్యాహ్న భోజన కార్మికుల రిలే దీక్షలు

ఏఐటీయూసీ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఈనెల 5 నుండి మధ్యాహ్న భోజన కార్మికుల రీలే దీక్ష లు నిర్వహిస్తామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య అన్నారు. గురువారం ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓమయ్య, మధ్యాహ్న భోజన వర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.చక్రపాణి, జిల్లా అధ్యక్షురాలు బైరి సాయమ్మ నిజామాబాద్ జిల్లాలో కార్మికుల బిల్లులు సుమారు 8 కోట్ల రూపాయల బకాయిలు చెల్లించలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మికులకు 2000 రూపాయల వేతనం పెంచుతున్నామని మార్చ్ 2022 సంవత్సరం నుండి వాటిని అమలు చేస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కోడిగుడ్లను ప్రభుత్వమే నేరుగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. 11 సంవత్సరాల క్రితం ఇచ్చిన వంట పాత్రల్లోనే వండుతున్నామని, గ్యాస్ సిలిండర్ ధరలు 1200 చేరిన వాటి బిల్లులు చెల్లించడం లేదని, గ్యాస్ సిలిండర్‌ను పభుత్వమే సరఫరా చేయాలని తదితర డిమాండ్లతో ఈనెల 5 నుండి 9 వరకు రిలే నిరాహార దీక్షలు నిర్వహించి కలెక్టర్ కార్యాలయం ముట్టడిని నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమాల్లో మధ్యాహ్న భోజన కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఓమయ్య

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని మగ్గిడి పాఠశాలలో మే 1 నుండి 31 వరకు జరిగిన వేసవి వాలీబాల్ శిక్షణ శిబిరం ముగించిందని వ్యాయామ ఉపాధ్యాయుడు మధు గురువారం తెలిపారు. ఈ శిక్షణ శిబిరంలో 32 మంది బాలికలు 30 మంది బాలురు వాలీబాల్ తర్ఫీదు పొందారని అన్నారు. శిక్షణ శిబిరానికి స్పోర్ట్స్ మెటీరియల్, మెడికల్ కిట్ అందించిన జిల్లా యూత్ అండ్ స్పోర్ట్స్ ఆఫీస్ కి ప్రత్యేక ధన్యవాదాలు, సహకరించిన సర్పంచ్, వీడిసి సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై అవగాహన



మాట్లాడుతున్న ఏఎస్ఐ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై మండలంలోని బషీరాబాద్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం షెడ్యూల్ కులాల ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ సక్కారం అశోక్ అధ్యక్షతన షెడ్యూల్ కులాల అభివృద్ధి సంస్థ నిజామాబాద్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో షెడ్యూల్ కులాల మండల ఇంచార్జ్ నవనిత ముఖ్య అతిథిగా పాల్గొని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై అవగాహన కల్పించారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని వినియోగించుకోవాల్సిన వివరించారు. గ్రామాల్లో అంటారానితనం రూపుమాపేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. అంటరానితనాన్ని పాటిస్తే బాధ్యులైన వారిపై చట్టరిత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం షెడ్యూల్ కులాల అభివృద్ధి కోసంఅనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతుందని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని షెడ్యూల్ కులాల ప్రజలు అభివృద్ధిలో ప్రయాణించాలన్నారు. కార్యక్రమంలో కమ్మర్‌పల్లి ఏఎస్ఐ ఇస్మాయిల్, మండల రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ శరత్ కుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు బైకాని మహేష్, నారాయణ, బాశెట్టి గంగాధర్, తోట అప్పయ్య శ్రీనివాస్, బందెల రాజు, నేళ్ల రమేష్, గ్రామ రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

మందులు ఉపయోగిస్తే హెచ్‌ఐవీ నుంచి రక్షణ

స్టాల్‌ను ప్రారంభించిన కార్పొరేటర్

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

నవతెలంగాణ-కంతేశ్వర్/నవీపేట్

నిజామాబాద్ జిల్లా కేంద్రం లోని గాంధీ చౌక్‌లోగల లేబర్ అడ్డా వద్ద సంపూర్ణ సురక్ష హెచ్ఐవిపై అవగాహన కార్యక్రమం స్టాల్‌ను కార్పొరేటర్ అబ్దుల్ ఖుద్దూస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్వో సుదర్శనం మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెచ్ఐవి పరీక్షల సేవలను పూర్తిగా ఉచితంగా ఉపయోగించుకోవాలని, వారి హెచ్ఐవి స్థితిని తెలుసుకుని సురక్షితంగా ఉండాలని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సరఫరా చేసిన ఏఆర్‌టి మందులను ఉపయోగించడం ద్వారా ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపవచ్చని అన్నారు. ఎయిడ్స్‌నుండి రక్షణకు కండోమ్‌లను ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో డిపిఎం సుధాకర్, జిల్లా టీబీ అండ్ హెచ్ఐవి కో ఆర్డినేటర్ రవిగౌడ్, బీఆర్ఎస్ ఈ కౌన్సెలర్ వర్లక్ష్మి, ప్రోగ్రాం మేనేజర్ ఎస్ కె. మొజాహిద్ అహ్మద్, ఆనంద్ సాగర్ గౌడ్, జీఎస్ఎమ్ నీలిమ, కౌన్సెలర్ గౌతమి, సిబ్బంది పాల్గొన్నారు.



కంతేశ్వర్: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

నవీపేట్ :మండల కేంద్రంలో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ ఆధ్వర్యంలో హెచ్ఐవి ఎయిడ్స్ పై ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లింక్ వర్కర్ రవి మాట్లాడుతూ హెచ్ఐవి ఎయిడ్స్ నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి రవీందర్ నాయక్, కో ఆప్షన్ నెంబర్ ముస్తాక్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



నవీపేట్‌లో...

శివాలయాన్ని పరిశీలించిన ఇంజనీరింగ్ శాఖ అధికారులు

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని పురాతన ఏకచక్రేశ్వర శివాలయం పునర్నిర్మాణంలో భాగంగా చేపట్టవలసిన పనులను ప్రారంభించడానికి దేవదాయ శాఖ ఇంజనీరింగ్ విభాగం అధికారులు గురువారం ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చక్రేశ్వర శివ మందిరంలో ఆలయ పునర్నిర్మాణం, రాజగోపురాలు, ప్రాకార మండపం, అన్నదాన సత్రం, కళ్యాణ మండపాలకు సంబంధించిన నిర్మాణ పనులకు గాను ప్లాన్స్, ఎస్టిమేషన్స్ కోసం పరిశీలించినట్టు తెలిపారు. ఆలయాన్ని పరిశీలించిన వారిలో దేవదాయ శాఖ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, చైర్మన్ బిర్కుర్ బుజ్జి, ధర్మకర్తలు శ్యామ్, పోశెట్టి, మాధవి, నారాయణ, లక్ష్మణ్ పటేల్, అర్చకులు గణేష్, మహేష్, జూనియర్ అసిస్టెంట్ రాములు, సుధాకర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్టీ సెల్ సమావేశం

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని మాలోత్ తండా (పర్మల్ల) గ్రామ పంచాయతీ నందు గురువారం రాష్ట్ర టిపిసిసి ప్రధాన కార్యదర్శి ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జ్ వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి ఆదేశాల మేరకు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు నౌసిలాల్ నాయక్ ఆదేశాల మేరకు లింగంపేట్ ఎస్టీ సేల్ మండల అధ్యక్షులు అంగోత్ వినోద్ నాయక్ గ్రామ ఎస్టీ సేల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్టీ సెల్ గ్రామ అధ్యక్షుడిగా రమావత్ సురేష్ నాయక్‌ను నియమించి నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు మన్నె నరేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బద్ధ చందు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీకి ఘన స్వాగతం పలికిన టీపీసీసీ ఉపాధ్యక్షులు మదన్ మోహన్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి


స్వాగతం పలుకుతున్న మదన్‌మోహన్

రాహుల్ గాంధీ అమెరికా పర్యటనలో భాగంగా అమెరికా వెళ్లిన సందర్భంగా వాషింగ్టన్ డీసీ నగరంలో రాహుల్ గాంధీకి టీపీసీసీ ఉపాధ్యక్షులు మదన్‌మోహన్ ఘన స్వాగతం పలికారు. అమెరికాలోని మూడు నగరాల్లో జరిగే వివిధ కార్యక్రమాల్లో రాహుల్ గాంధీ పాల్గొంటారు. మంగళవారం నుంచి ఈ పర్యటన ప్రారంభమైంది. ఆయన అమెరికన్ ప్రజా ప్రతినిధులతోనూ, భారతీయ మూలాలు గల ప్రజలతోనూ మాట్లాడతారు. ఉమ్మడి విలువలను ప్రోత్సహించడం, నిజమైన ప్రజాస్వామిక దార్శనికతను అభివృద్ధి చేయడం లక్ష్యంగా రాహుల్ గాంధీ పర్యటిస్తున్నారు.

మార్కెట్ కమిటీ గ్రేడ్-2 సెక్రెటరీగా శ్రీకాంత్


సెక్రెటరీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-పిట్లం

మార్కెట్ కమిటీ గ్రేడ్-2 సెక్రెటరీగా శ్రీకాంత్ గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. గాంధారి మండల మార్కెట్ కమిటీలో గ్రేడ్ - 3 గా కొనసాగిన శ్రీకాంత్ పదోన్నతిపై వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసిన సెక్రెటరీ వజీరోద్దిన్ 10 అక్టోబర్ 2020న అనారోగ్యంతో మృతిచెందగా మద్నూర్ మండల మార్కెట్ కమిటీ సెక్రెటరీ విట్టల్ ఇంచార్జీ సెక్రెటరీగా కొనసాగారు. కార్యక్రమంలో చైర్మెన్ వాసరి సావిత్రి, మాజీ జడ్పీటీసీ ప్రతాప్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వాసరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ గుడి నిర్మాణానికి భూమిపూజ


గుడి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని లింగంపల్లి గ్రామంలో ఎల్లమ్మ గుడి నిర్మాణానికి గురువారం భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుండెల్లి సాయిలు, బాలర్జున్‌గౌడ్, దశగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, చందర్‌రావు, మోహన్‌రావు, గంగారెడ్డి, గ్రామప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫోర్ట్ యజమానికి సన్మానం


యజమానిని సన్మానిస్తున్న చైర్మెన్

నవతెలంగాణ-లింగంపేట్

ట్రాన్స్‌ఫోర్ట్ యజమాని వీరభద్రరావుకు లింగంపేట్ సింగిల్ విండో కార్యాలయంలో చైర్మన్ కూచంపల్లి దేవేందర్‌రెడ్డి శాలువా కప్పి గురువారం ఘనంగా సన్మానించారు. యాసంగిలో ధాన్యం కొనుగోలు కేంద్రం సింగిల్ విండో పరిధిలో ఏర్పాటు చేయగా రవాణా సౌకర్యం కోసం రైతులు పండించిన ధాన్యాన్ని రైస్ మిల్లర్లకు తరలించేందుకు ట్రాన్స్‌ఫోర్ట్ యజమాని వీరభద్రరావు 100 పైగా లారీలను ఏర్పాటుచేసి సకాలంలో రైస్ మిల్లర్లకు తరలించడంలో ప్రధాన పాత్ర పోషించాడని అన్నారు. కల్లాల వద్ద రైతుల ధాన్యం నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు రవాణా సౌకర్యం ఇబ్బంది కలగకుండా లారీలను సకాలంలో పంపించారని తెలిపారు. జిల్లాలో సకాలంలో రైస్ మిల్లర్లకు దాగిన తరలించడంలో లింగంపేట్ మండలం సొసైటీ ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు.

ఘనంగా గంగమ్మ కల్యాణ మహోత్సవం

నవతెలంగాణ-భిక్కనూర్

మండల కేంద్రంలోని గంగమ్మ ప్రథమ వార్షికోత్సవాల్లో భాగంగా గురువారం గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన గంగాదేవి కళ్యాణ మహోత్సవంలో బీజేపీ నియోజకవర్గ ఇన్చార్జ్ కాటిపల్లి వెంకట రమణారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. ఆలయాభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని సభ్యులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చౌదరి చెరువును పరిశీలించిన ఎంపీడీవో

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని కన్నాపూర్ పోల్కంపేట్ గ్రామ సమీపంలో గల చౌదరి చెరువును ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి గురువారం పరిశీలించారు. శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా మన ఊరు మన చెరువు కార్యక్రమాన్ని నిర్వహించడానికి అనుకూలమైన చెరువు పరిశీలించారు. ఆయన వెంట సర్పంచ్ పద్మా నాగరాజు, నీటిపారుదల శాఖ ఏఈ అరుణ, కార్యదర్శి అశ్వక్, గ్రామపంచాయతీ పాలకవర్గం సభ్యులు గ్రామస్తులున్నారు.

బాన్సువాడ ఆస్పత్రిలో అగ్నిప్రమాదం

- రూ.25 లక్షల విలువ గల ఆపరేషన్ థియేటర్ సామగ్రి దగ్ధం
- పరుగులు తీసిన రోగులు.. నచ్చజెప్పిన వైద్యులు

నవతెలంగాణ-నసురుల్లాబాద్(బాన్సువాడ)



కాలిపోయిన ఆపరేషన్ థియేటర్

కామారెడ్డి జిల్లా బాన్సువాడ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం ఉదయం 8:30 గంటల సమయంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. 'ఇది షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ ప్రసాద్, అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. ఏరియా ఆసుపత్రిలోని మొదటి అంతస్తులో ఉన్న ఆపరేషన్ థియేటర్ వద్ద ఉదయం మంటలు రావడంతో ఆసుపత్రి వాచ్‌మెన్ శివయ్య చూసి అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. ఆపరేషన్ థియేటర్లో ఉన్న ఏసీ పేలడంతో మంటలు చెలరేగి నాలుగైదు గదులకు మంటలు అంటుకున్నాయి. ఈ ప్రమాదంలో రూ.25 లక్షల విలువైన ఫర్నీచర్ ఆపరేషన్ థియేటర్ సామగ్రి కాళీ బూడిదైంది. ఏరియా ఆసుపత్రికి ఎదుట మాతా శిశు సంరక్షణ ఆసుపత్రి ఏర్పడడంతో గత కొన్ని నెలలుగా ఆపరేషన్ థియేటర్ మూసి ఉంచారు. నిత్యం వాచ్‌మెన్లు ఆపరేషన్ థియేటర్ గదులు శుభ్రం చేస్తున్న సమయంలో ఒకేసారి మంటలు చెలరేగడంతో విలువైన సామగ్రి కాలి బూడిదైంది. ఆపరేషన్ థియేటర్ ముందు ఉన్న మహిళ వార్డులో ఉన్న రోగులను తరలించారు. కొందరు రోగులు భయపడి ఇంటికి తరలి వెళ్లారు. కాళీ బూడిదైన ఆపరేషన్ థియేటర్ పక్కనే మరో గదిలో 30 లక్షల విలువైన వైద్య పరీక్షలకు సంబంధించిన యంత్రాలు ఉన్నాయి. సుమారు 6 గదులకు సంబంధించిన తలుపులు, కిటికీలు అన్ని ధ్వంసమయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ ప్రసాద్ వెంటనే స్పందిస్తూ ఘటనా స్థలానికి చేరుకుని ఆపరేషన్ థియేటర్ ఎదురుగా ఉన్న రోగులను వివిధ వార్డులకు తరలించారు. మరికొందరు పరుగులు తీస్తుంటే వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. జరిగిన ఘటనపై ఉన్నతాధికారులకు, పోలీసులకు, అగ్నిమాపక కేంద్రానికి ఫిర్యాదు చేశారు.

రౌడీషీటర్ దారుణ హత్య

- ఘటనా స్థలాన్ని పరిశీలించిన బోధన్ ఏసీపీ

నవతెలంగాణ-ఎడపల్లి


హారిఫ్ మృతదేహం

ఓ రౌడీషీటర్ దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన ఎడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బోధన్ నిజామాబాద్ ప్రధాన రహదారి ఎడపల్లి పెద్దవాగు వంతెనపై గురువారం మధ్యాహ్నం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. నిజామాబాద్ నగరానికి చెందిన హారిఫ్ డాన్ (28) అనే రౌడీషీటర్ గురువారం బోధన్ కోర్టులో వాయిదాకు హాజరై నిజామాబాద్‌కు ద్విచక్రవాహనంపై తిరిగి వెళుతున్నాడు. బోధన్ నిజామాబాద్ ప్రధాన రహదారి ఎడపల్లి పెద్దవాగు సమీపంలో అతడిని అనుసరించి వస్తున్న నిజామాబాద్ నగరానికి చెందిన ప్రత్యర్థులు ఆయన హతమార్చారు. ఆరిఫ్ డాన్‌పై రెండు హత్య కేసులు, రెండు హత్యాయత్నం కేసులు, దొంగతనం కేసులున్నాయి. జనవరి 1న నిజామాబాద్ నగర శివారులోని నెహ్రూనగర్‌లో జంగల్ ఇబ్బు అలియాస్ ఇబ్రహీం అనే రౌడీషీటర్‌ను హత్య చేసి మూడు నెలల క్రితమే జైలు నుంచి హారిఫ్ విడుదలయ్యాడు. హారిఫ్ జైలు నుంచి విడుదల తర్వాత పీడీ యాక్ట్ నమోదు చేస్తామని అనుకున్న పోలీసులు రెగ్యులర్ సీపీ లేకపోవడంతో వాయిదా పడింది. ఈ సమయంలోనే ప్రత్యర్థుల చేతిలో ఆరిఫ్ డాన్ హతమయ్యాడు. ఎడపల్లి పోలీసులు కేసు నమోదు చేసి హారిఫ్ మృతదేహాన్ని నిజామాబాద్ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. హారిఫ్‌ను హత్య చేసిన వారిని పట్టుకునేందుకు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కామారెడ్డి నుంచి దెగ్లూర్ బస్సు ప్రారంభం

నవతెలంగాణ-లింగంపేట్/పిట్లం/మద్నూర్


ప్రారంభమైన బస్సు

కామారెడ్డి నుంచి వయా తాడ్వాయి, లింగంపేట్, ఎల్లారెడ్డి, నిజాంసాగర్, పిట్లం, పెద్దకొడప్‌గల్, బిచ్కుంద, మద్నూర్ మీదుగా మహారాష్ట్ర దేగ్లూర్ వరకు కొత్తగా కామారెడ్డి డిపో బస్సు ప్రారంభించామని కామారెడ్డి డిపో అసిస్టెంట్ మేనేజర్ మూర్తి గురువారం తెలిపారు. కామారెడ్డి నుంచి ఉదయం 11:00 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 2.30 గంటలకు దేగ్లూర్ చేరుకుంటుందని, తిరిగి 3 గంటలకు దేగ్లూర్ నుంచి ప్రారంభమై 6.30కి కామారెడ్డి చేరుకుంటుందని, కామారెడ్డి నుంచి సాయంత్రం 6.30 గంటలకు మళ్లీ బయలుదేరి దేగ్లూర్‌లో నైట్ హల్ట్ ఉండి, ఉదయం 6 గంటలకు బయలుదేరి 9:30కి కామారెడ్డి చేరుకుంటుందని ఆయన అన్నారు. అంతర్రాష్ట్ర సర్వీసును ప్రారంభించామని, ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. మద్నూర్, జుక్కల్, పెద్దకొడప్‌గల్ మండలాలకు చెందిన ప్రజలు జిల్లా కేంద్రానికి చేరుకోవాలంటే ఈ ప్రయాణం సునాయసంగా ఉంటుందన్నారు.

కల్లిబొల్లి మాటలు స్పీకర్‌కు తగదు

- కాంగ్రెస్ నాయకులు యలమంచిలి శ్రీనివాస్‌రావు

నవతెలంగాణ-వర్ని


మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

నియోజకవర్గంలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి గత వారం క్రితం నెమ్లి గ్రామంలో సాయిబాబా మందిరంలో రైతు సదస్సు పేరుతో సమావేశం నిర్వహించి రైతులు వరినాట్లు కాలం జరపాలని తెలపటం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ నాయకులు యలమంచిలి శ్రీనివాస్‌రావు విమర్శించారు. గురువారం వర్ని మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడుతూ.. ఏండ్ల నుంచి రైతులు వ్యవసాయం చేస్తున్నారని, ఎప్పుడు నాట్లు వేసుకోవాలో, ఎప్పుడు కోతలు కోయాలో రైతులకు బాగా తెలుసునని అన్నారు. స్పీకర్ మాత్రం ఇప్పుడు కొత్తగా పంటను ముందుగా వేసుకోవాలని నీతులు చెప్పడం సరికాదని అన్నారు. రైతులకు అంతగా సహాయం చెయ్యాలనుకుంటే ముందస్తుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, మద్దతు ధర ఇవ్వాలని అన్నారు. పంటలతో రాజకీయం చేయకూడదని రైతులు రాజకీయ నాయకుల కంటే చాలా తెలివైన వారని పేర్కొన్నారు. రైతులను మభ్యపెట్టడానికి కల్లి బొల్లి మాటలు చెప్పడం హోదాకు తగదన్నారు. ఓట్ల సమయం దగ్గర పడటంతో రైతు సదస్సులు, మరో సదస్సులు అంటూ రైతులను, ప్రజలను పక్కదోవపట్టిస్తున్నారని అన్నారు. ఇప్పటికీ రైతులకు రుణమాఫీ చేయక ప్రభుత్వం విఫలమైంద న్నారు. బాన్సువాడ నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీకి రైతుల మద్దతు ఉందని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో డీసీసీ డెలిగేట్ డాక్టర్ కూనీపూర్ రాజారెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షులు సురేష్ బాబా, మైనార్టీ సెల్ రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరీ ఎక్బాల్, డీసీసీ కార్యదర్శి గంగాప్రసాద్, కిసాన్ కేత్ మండలాధ్యక్షులు గంగప్ప, వెంకట్‌గౌడ్, రెడ్డి రాంబాబు, గజ్జల సాయిలు, చంద దత్తు, శ్రీహరి, మోయిన్, సుధాకర్, హనుమంతరావు, వెంకటి, శివరెడ్డి, పృథ్వి పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

- ఎమ్మెల్యే జాజాల సురేందర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జాజాల సురేందర్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. గురువారం ఎల్లారెడ్డి నియోజకవర్గస్థాయి అధికారులతో ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జాజాల సురేందర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని ప్రతి అధికారి పాల్గొనాలని ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఎల్లారెడ్డి నియోజకవర్గ అన్ని మండలాల అధికారులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు ముస్తాబైన కార్యాలయాలు

నవతెలంగాణ-సదాశివనగర్/ఎడపల్లి

మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలను దశాబ్ది ఉత్సవాలకు గురువారం ముస్తాబు చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో, మార్కెట్ కమిటీ, ఐకేపీ, వ్యవసాయ కార్యాలయం, సీఐ కార్యాలయం, పోలీసుస్టేషన్‌లను అలంకరించారు.

ఎడపల్లి : మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద అధికారులు, ప్రజాప్రతినిధులు పచ్చని మామిడి తోరణాలతో కార్యాలయాలను అలంకరించారు. జూన్ రెండవ తేదీన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమం ఉన్నందున ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ముత్యంపేట బీపీఎంపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-దోమకొండ

మండలంలోని ముత్యంపేట గ్రామంలో బీపీఎంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వార్డ్ సభ్యులు శ్రీనివాస్, గ్రామస్తులు దోమకొండ మండల కేంద్రంలోని పోస్టాఫీస్ కార్యాలయంలో పోస్ట్ మేనేజర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముత్యంపేట గ్రామంలో ఆసరా పింఛన్ పంపిణీ చేయడంలో అవకతవకలకు పాల్పడుతున్నారని, ప్రభుత్వ పథకాల నిధుల పంపిణీ, డిపాజిట్‌ల నిధులు తదితరుల వాటిపై అధికారులతో కమిటీ ఆధ్వర్యంలో విచారణ చేయాలని, అక్రమాలకు పాల్పడిన బీపీఎంపై చర్యలు తీసుకోవాలని కోరారు. ముత్యంపేట గ్రామంలో ప్రజలతో నిర్లక్ష్యంతో మాట్లాడుతున్నారని, ఇష్టం వచ్చినట్టు మాట్లాడడం, అమర్యాదగా ప్రవర్తించారని, ముత్యంపేట బీపీఎంపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఎంపీడీఓ చిన్నరెడ్డికి సైతం ఫిర్యాదు చేశారు.

3 నుంచి బడిబాట నిర్వహించాలి

- ఎంఈఓ నాగనాథ్

నవతెలంగాణ-బోధన్


మాట్లాడుతున్న ఎంఈవో

ఈనెల మూడవ తేదీ నుంచి 9వ తేదీ వరకు ప్రతి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల నమోదు కోసం బడిబాట నిర్వహించాలని బోధన్ మండల విద్యాధికారి నాగనాథ్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సాలూర మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగేలా తప్పనిసరిగా ఉదయం 7 గంటల నుంచి బడిబాట నిర్వహించాలని సూచించారు. ఈ నెల 12 నుంచి పాఠశాలల పున్హప్రారంభం అవుతాయని, అప్పటి వరకు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు సిద్ధం చేయాలని అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో ఉపాధ్యాయులందరూ పాల్గొనాలని సూచించారు. బోధన్ మండలంలో మన ఊరు మనబడికి సంబంధించిన ఐదు పాఠశాలలు సిద్ధంగా ఉన్నాయని ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్టు తెలిపారు. అనంతరం ఎంపీడీవో వర్షన్న మాట్లాడుతూ.. వర్ష కాలంలోపు శిథిలావస్థలో ఉన్న గదులను కూల్చివేసి పాఠశాల ఆవరణములను శుభ్రంగా ఉంచాలని సూచించారు. దశాబ్ది ఉత్సవాలు జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు హన్మాగ్రేస్, సాయిలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

హెచ్ఐవీకి నివారణ ఒక్కటే మార్గం

నవతెలంగాణ-దోమకొండ



అవగాహన ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

హెచ్ఐవీ నిర్మూలనకు నివారణ ఒక్కటే మార్గమని చైల్డ్ ఫండ్ ఇండియా లింకు వర్కర్స్ స్కీమ్ డీఆర్పీ గర్దాసు సుధాకర్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో లింకు వర్కర్ స్కీం ఆధ్వర్యంలో జెడ్పీటీసీ సభ్యుడు తీగల తిర్మల్‌గౌడ్, సర్పంచ్ నల్లపు అంజలి శ్రీనివాస్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ సంగీత్‌కుమార్ హెచ్ఐవీపై అవగాహన ర్యాలీని ప్రారంభించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీని కొనసాగించారు. హెచ్ఐవీపై అవగాహన, నివారణ మార్గాలపై వారు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హెచ్ఐవీ నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ప్రతి ఒక్కరూ హెచ్ఐవీ పరీక్ష చేయించుకోవాలని అన్నారు. హెచ్ఐవీ బాధితుల పట్ల వివక్షత చూపవద్దని కోరారు. వ్యాధి నివారణ జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వైద్యులు నిఖిల్, సొసైటీ చైర్మన్ నాగరాజురెడ్డి, గ్రామ కార్యదర్శి సౌజన్య, ఉప సర్పంచ్ గజవాడ శ్రీకాంత్, మాజీ ఎంపీటీసీ నల్లపు శ్రీనివాస్, వార్డు మెంబర్లు బొమ్మెర శ్రీనివాస్, భూలక్ష్మి, బీఆర్ఎస్ మండల నాయకులు కానుగంటి నాగరాజు, ఎంఎల్‌హెచ్‌పీ జ్యోతి, ఏంపీహెచ్ఏలు సంజీవి సువర్ణ, సునీత, లింకు వర్కర్ స్కీమ్ సూపర్వైజర్ సాయిలు, లింకు వర్కర్లు బాలకిషన్, కృష్ణమూర్తి, శివరాములు, సాయిలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు హాజరుకావాలి

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలో నేటి నుంచి ఈనెల 22 వరకు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చేపట్టే వేడుకలకు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలని ఎడపల్లి ఎంపీడీవో గోపాలకృష్ణ, తహసీల్దార్ ఆకుల శేఖర్, ఏపీఎం సాయిలు గురువారం ఒక ప్రకటనలో కోరారు. జూన్ 2 శుక్రవారం ఉదయం ప్రభుత్వ కార్యాలయం వద్ద జాతీయ పతకావిష్కరణ కార్యక్రమం ఉన్నందున ప్రతి ఒక్కరూ హాజరుకావాలని కోరారు.

కార్యకర్తలకు అండగా కాంగ్రెస్

నవతెలంగాణ-భిక్కనూర్


చెక్కు అందజేస్తున్న మాజీ మంత్రి

కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కార్యకర్తలను కంటికి రెప్పలా చూసుకుంటుందని, మాజీమంత్రి షబ్బీర్ అలీ తెలిపారు. గురువారం మండల కేంద్రానికి చెందిన పార్టీ కార్యకర్త బసగళ్ల సిద్ధిరాములుకు రెండు లక్షల ప్రమాద బీమా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పార్టీ సభ్యత్వ నమోదు జరిగిందని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సర్బిర్యాల్‌లో గ్రామసభ నిర్వహణ



నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని సుర్బిర్యాల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉపాధి హామీ చట్టంపై ప్రజావేదిక గ్రామ సభ గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సట్లపల్లి సవితగణేష్, కార్యదర్శి రవికుమార్, సామజిక తనిఖీ బందం అధికారులు సంధ్య ప్రియాంక, రాణి, ఫీల్డ్ అసిస్టెంట్ సాయిలు, గ్రామపంచాయతీ కారోబార్ యోగేష్, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ జితిష్ వి. పాటిల్

నవతెలంగాణ-రామారెడ్డి

దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని, దశాబ్ది ఉత్సవాల ఏర్పాట్లు ఘనంగా ఉండాలని రైతులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. మండలంలోని అన్నారం గ్రామంలో దశాబ్ది ఉత్సవాల ఏర్పాట్లను గురువారం పరిశీలించి పలు సూచనలు చేశారు. పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని, ఇక్కట్లు కలగకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఏడిఏ రత్న, తహశీల్దార్ ఆనంద్, ఏవో హరీష్ కుమార్, ఎంపీవో సవిత, సర్పంచ్ అమత బాలరాజు,ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీ చంద్రకళ గంగారెడ్డి, సొసైటీ డైరెక్టర్ స్వామిగౌడ్,ఆసరి కిషన్,సాయిరాం గౌడ్, సతీష్ గౌడ్,కార్తీక్, తదితరులు ఉన్నారు.

ప్రజాభిప్రాయానికి పెద్దపీట వేస్తేనే ప్రగతి

- విద్యా ప్రయివేటీకరణతో పెరుగుతున్న అంతరాలు
- సర్కారు విద్యాసంస్థల్లో ఖాళీలను భర్తీ చేయాలి
- నవతెలంగాణతో ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

ప్రజాస్వామ్యంలో ప్రజాభిప్రాయానికి పెద్దపీట వేస్తేనే రాష్ట్రం ప్రగతి పథంలో ముందుకెళ్తుందని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దాన్ని అలవర్చు కోవాల్సిన అవసరముందని చెప్పారు. మానవాభివృద్ధి సూచికలో ఏ రాష్ట్రం ముందంజలో ఉంటే అది అభివృద్ధిలోనూ ముందుం టుందని వివరించారు. అభివృద్ధి ఫలాలు అందరికీ అందించా ల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందన్నారు. కొందరికే అందిం చడం సరైంది కాదని అన్నారు. ప్రభుత్వరంగం బలోపేతం అయితేనే అందరికీ నాణ్యమైన విద్య అందుతుందని చెప్పారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నవతెలంగాణ ప్రతినిధి బొల్లె జగదీశ్వర్‌కు ఎమ్మెల్సీ నర్సిరెడ్డి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు...



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలపై ఏమంటారు? ప్రజల ఆకాంక్షలు నెరవేరాయంటారా?

తెలంగాణ ఆవిర్భవించి తొమ్మిదేండ్లు పూర్తవుతున్న సందర్భంగా ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తున్నది. ప్రజల ఆకాంక్షలు నెరవేరాయా?అన్నది బీఆర్ఎస్ ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంపై ఆధారపడి ఉన్నది. వాటిని గమనిస్తే పాక్షికంగానే నెరవేర్చింది. సాగునీరు, విద్యుత్, చెరువుల పునరుద్ధరణ, హైదరాబాద్‌లో మౌలిక సదుపాయాల కల్పన, హరితహారం, సంక్షేమ కార్యక్రమాల అమలు, ఆసరా పెన్షన్లు, కళ్యాణలక్ష్మి వంటి అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చింది. దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని చెప్పి దళితబంధు పేరుతో రూ.10 లక్షలు ఆర్థిక సాయం చేస్తున్నది. ఇది ప్రారంభదశలోనే ఉన్నది. పూర్తిగా విజయవంతమైందని చెప్పలేం. అందరికీ ఒకే రకమైన విద్య అని 2014లో ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించింది. కానీ విద్యారంగం ఇంకొంత ప్రయివేటురంగంలోకి వెళ్లిపోయింది.

అనేక రంగాల్లో అభివృద్ధితో దేశానికే ఆదర్శమంటూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తున్నది కదా. మీరేమంటారు?

దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్ అన్నారు గురజాడ. మానవాభివృద్ధి సూచికలో ప్రథమ స్థానంలో ఉంటే ఆ రాష్ట్ర అభివృద్ధిలో కూడా ప్రథమ స్థానంలో ఉంటుంది. దీనికి విద్యావైద్యం, ఉపాధి, తలసరి ఆదాయం పంపిణీ కీలకం. ఈ రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం కృషి నామమాత్రంగానే ఉంది. జీఎస్‌డీపీలోగాని తలసరి ఆదాయంలోగాని ఉన్నత స్థితిలో ఉండొచ్చు. ఒకరికి రూ.కోటి దాయం, మరొకరికి రూ.రెండు లక్షల ఆదాయం ఉంటుంది. ఇద్దరి తలసరి ఆదాయం రూ.51 లక్షలవుతుంది. కానీ రూ.రెండు లక్షల ఆదాయం ఉన్న కుటుంబం రూ.51 లక్షలకు ఎప్పుడు చేరుకుంటుంది. ఈ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించాలి.

సర్కారు బడుల్లో ఆంగ్ల మాధ్యమం, గురుకులాలను పెద్దఎత్తున ప్రవేశపెట్టామని ప్రభుత్వం చెప్పడంపై మీ అభిప్రాయమేంటీ?

దేశంలోనే అత్యధిక గురుకులాలున్న రాష్ట్రం తెలంగాణ అన్నది యదార్థం. 60 లక్షల మంది విద్యార్థులున్న ఈ రాష్ట్రంలో గురుకులాల్లో చదువుకునేది ఐదు లక్షల మంది మాత్రమే. ప్రభుత్వ, మండల, జిల్లా పరిషత్, ఎయిడెడ్ పాఠశాలలతోపాటు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలు సర్కారు ఆధీనంలో ఉన్నాయి. ఈ స్కూళ్ల అభివృద్ధి కోసం 2021, డిసెంబర్ వరకు ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టలేదు. 2022, జనవరిలో మన ఊరు మనబడి కార్యక్రమాన్ని 9,123 స్కూళ్లలో రూ.3,497 కోట్లతో మొదటి విడత చేపట్టింది. 12 రకాల మౌలిక వసతులను కల్పిస్తామని ప్రకటించింది. కానీ నిర్దిష్టమైన బడ్జెట్ కేటాయింపుల్లేక నేటికీ మూడో వంతు బడుల్లో కూడా పనులు పూర్తి కాలేదు. ఏ బడులకైతే తక్కువ పనులు, రంగులు, డ్యూయెల్ డెస్కులు, గ్రీన్ బోర్డులు ఏర్పాటు చేసే 1,500 బడుల్లో పనులు పూర్తయినట్టు కనిపిస్తున్నది. ఎక్కువ అవసరాలున్న పాఠశాలల్లో పనులు పూర్తి కాలేదు. బడికి టీచర్ కీలకం. ప్రభుత్వ బడుల్లో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అన్ని శాఖల్లో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్లు వస్తున్నాయి కానీ ఉపాధ్యాయ నియామకాలకు నోటిఫికేషన్ జారీ కావడం లేదు. ఈ విద్యాసంవత్సరమైనా ప్రతి బడికి పారిశుధ్యం, ఇతర పనుల కోసం సర్వీసు పర్సన్లను నియమించాలి. కాంట్రాక్టు అధ్యాపకుల క్రమబద్ధీకరణ అభినందనీయం. జూన్ ఒకటో తేదీ నుంచి గెస్ట్ లెక్చరర్లను నియమించాలి. విశ్వవిద్యాలయాల్లో ఖాళీ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలి. వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి. నిర్వహణ గ్రాంటును పెంచాలి.

కొన్ని రాష్ట్రాలు, ప్రయివేటు విద్యాసంస్థల్లో డిజిటల్ విద్య అమలవుతున్నది. దీనిపై ఏమంటారు?

రాష్ట్రంలో పాఠశాల విద్య మొదలుకుని ఉన్నత విద్య వరకు అంతరాలు పెరుగుతున్నాయి. ప్రభుత్వ విద్యాసంస్థలను అభివృద్ధి చేయడం ద్వారా మాత్రమే విద్యలో అంతరాలను తొలగించే అవకాశముంటుంది. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 20 శాతం, కొఠారి కమిషన్ సిఫారసుల ప్రకారం కేంద్ర బడ్జెట్‌లో పది శాతం నిధులు కేటాయించాలి. అప్పుడు అంతరాల్లేని విద్య అందించొచ్చు. ప్రయివేటు విద్యలోనూ చాలా అంతరాలు కనిపిస్తున్నాయి. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నది.

తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా మీ సందేశమేంటీ?

నేను ఒక టీచర్‌ను. ప్రజాస్వామ్యమంటే 'ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రజలే పరిపాలించుకునేది' అనే వాక్యాన్ని పదేపదే భావిభారత పౌరులకు చెప్పాను. చట్టసభల్లో సభ్యున్ని అయ్యాక ఆ నిర్వచనం తలకిందులు అయినట్టు కనిపిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం దాన్ని సవరించుకోవాలి. ప్రజాస్వామ్యంలో సాధ్యమైనంత మేరకు ప్రజల అభిప్రాయాలకు పెద్దపీట వేయాలి. అప్పుడే ప్రగతి సాధ్యమవుతుంది. ప్రజల అభిప్రాయాలను వ్యక్తీకరించేది వివిధ ప్రజాసంఘాలు, సమూహాలు, రాజకీయ పార్టీలు. ఈ సమూహాలతో అవసరమైన సందర్భాల్లో చర్చించే ఆనవాయితీని రాష్ట్ర ప్రభుత్వం అలవర్చుకోవాలి.

నాణ్యమైన విద్య అందించే బాధ్యత ప్రభుత్వానిదే

- తరగతికో టీచరుంటేనే విద్యాప్రమాణాలు మెరుగు
- సీపీఎస్‌ను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసి కేంద్రంపై ఒత్తిడి పెంచాలి
- నవతెలంగాణతో టీఎస్‌యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి చావ రవి

గురుకులాల తరహాలోనే సర్కారు బడుల్లో చదివే పేదలు, దళితులు, బడుగు, బలహీనవర్గాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు బాగుపడాలంటే ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని, బదిలీలు చేపట్టాలి, ఖాళీ పోస్టులను చేయాలని కోరారు. పర్యవేక్షణ అధికారుల కొరతను తీర్చాల్సిన అవసరముందన్నారు. తరగతికో టీచర్ లేదంటే సబ్జెక్టుకో ఉపాధ్యాయుడు ఉంటేనే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరగవుతాయని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మన ఊరు మనబడి పథకానికి నిధులను కేటాయించి త్వరగా పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నవతెలంగాణ ప్రతినిధి బొల్లె జగదీశ్వర్‌కు చావ రవి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు...

తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా విద్యారంగంలో సాధించిన ప్రగతిపై మీరేమంటారు?

తెలంగాణ ఆవిర్భవించి తొమ్మిదేండ్లు పూర్తయి పదో వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు. రాష్ట్రంలో విద్యారంగానికి సంబంధించి చూస్తే మండల, జిల్లా పరిషత్, ప్రభుత్వ పాఠశాలలను మాత్రం ఈ ప్రభుత్వం పట్టించుకున్న పరిస్థితి లేదు. దాదాపు 750 కొత్త గురుకులాలను ఏర్పాటు చేశారు. గురుకు లాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పిల్లలకు కొంత మంది ప్రతిభ కలిగిన విద్యార్థులకు రూ.1.25 లక్షలు ఖర్చు పెడుతూ నాణ్యమైన విద్యను అందిస్తు న్నారు. అన్ని గురుకులాల్లో కలిపి ఐదు లక్షల మంది చదువుతున్నారు. అత్యధికంగా దళితులు, బడుగు బలహీనవర్గాల పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకుంటున్నారు. వారికి నాణ్యమైన విద్య అందించే బాధ్యత ప్రభుత్వంపైనే ఉన్నది. గురుకులాల్లో ఐదు లక్షలు, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 24.5 లక్షల మంది చదువుతున్నారు.

మన ఊరు మనబడి కార్యక్రమం ఎలా అమలవుతున్నది?

గిరిజన ఆశ్రమ పాఠశాలలకు 1,200 పోస్టులు కావాలని ప్రభుత్వాన్ని కోరితే ఇప్పటి వరకు అతీగతీ లేదు. మండల, జిల్లా పరిషత్ బడుల్లో 2017లో టీఆర్టీ ద్వారా 8,792 పోస్టులు భర్తీ చేశారు. ఇంకా 22 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటి భర్తీని పట్టించుకోవడం లేదు. ఇది ఉపాధ్యాయుల పంచాయతీ, సర్వీసు రూల్స్ సమస్య అంటూ ప్రభుత్వం వదిలేస్తున్నది. విద్యాశాఖ పట్ల సరైన ఆసక్తి ఉన్న అధికారుల్లేరు. తల్లిదండ్రుల డిమాండ్ మేరకు గతేడాది సమాంతరంగా ఇంగ్లీష్ మీడియాన్ని ప్రవేశపెట్టారు. పాఠశాలల్లో రూ.7,289 కోట్లతో మన ఊరు మనబడి పథకాన్ని ప్రారంభించారు. 12 రకాల మౌలిక వసతులు అభివృద్ధి చేస్తామన్నారు. 9,123 స్కూళ్లలో మొదటి దశలో బాగు చేస్తామన్నారు. ఇప్పటి వరకు ఏడాది గడిచింది చాలా స్కూళ్లలో మౌలిక వసతుల కల్పన పూర్తి కాలేదు. హైకోర్టులో ఉన్న స్టే ఎత్తేసి బదిలీలు, పదోన్నతులు చేపట్టి కొత్త ఉపాధ్యాయ నియామకాలు చేపడితే వచ్చే విద్యాసంవత్సరం సజావుగా కొనసాగుతుంది. గురుకులాలతో సమానంగా సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

ప్రభుత్వ పాఠశాలల్లో పర్యవేక్షణ వ్యవస్థ ఎలా ఉందంటారు?

రాష్ట్రంలో 33 జిల్లాలు ఏర్పడ్డాయి. జిల్లాకో కలెక్టర్, ఎస్పీ, సీఈవోను ఇచ్చారు. కానీ జిల్లాకో డీఈవోను ఇవ్వడం మరిచిపోయారు. అసిస్టెంట్ డైరెక్టర్లు ఇన్‌చార్జీ డీఈవోలుగా వ్యవహరిస్తున్నారు. ఇది దారుణం. ఉన్నత పాఠశాలల పర్యవేక్షణకు డిప్యూటీ డీఈవోలుండాలి. 62 పోస్టుల్లో నలుగురే రెగ్యులర్ డిప్యూటీ డీఈవోలున్నారు. 484 ఎంఈవో పోస్టుల్లో 17 రెగ్యులర్ ఎంఈవోలున్నారు. ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు ఇన్‌చార్జీ ఎంఈవోలుగా కొనసాగుతున్నారు. ఒక్కొక్కరికీ మూడు నుంచి 12 మండలాలకు అదనపు బాధ్యతలను అప్పగించారు. ప్రభుత్వం, విద్యాశాఖ అడిగిన గణాంకాలను ఇవ్వడానికే వారి పరిమితమవుతున్నారు. అన్ని ఖాళీ పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలి. అలా చేస్తేనే మార్పు వస్తుంది.

తొమ్మిదేండ్ల కాలంలో టీఎస్‌యూటీఎఫ్ చేసిన ఉద్యమాలు, సామాజిక కార్యక్రమాల గురించి వివరించండి?

రాష్ట్రంలో ఐక్య ఉద్యమాలకు టీఎస్‌యూటీఎఫ్ చిరునామాగా మారింది. పోరాటాలకు దిక్సూచిగా ఉన్నది. ఇతర ఉపాధ్యాయులు కూడా టీఎస్‌యూటీఎఫ్‌ను ఆదరిస్తున్నారు. ఈ తొమ్మిదేండ్ల కాలంలో సభ్యత్వం రెట్టింపైంది. వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి టీఎస్‌యూటీఎఫ్ పూర్వ అధ్యక్షులు అలుగుబెల్లి నర్సిరెడ్డి ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల మద్దతుతో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గంలో విజయం సాధించకపోయినా గణనీయమైన ఓటింగ్‌ను పొందాం. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాడుతున్నాం. సందర్భానుసారం ఐక్య ఉద్యమాల్లో భాగస్వామ్యం అవుతున్నాం. 18 ఉపాధ్యాయ సంఘాలతో అతిపెద్ద ఐక్యవేదికగా యూఎస్‌పీసీ ఉన్నది. టీఎస్‌యూటీఎఫ్ సామాజిక కార్యక్రమాల్లో ముందున్నది.

కలెక్టరేట్‌లో ఎక్కడిచెత్త అక్కడే

- పర్యవేక్షణ కరువు
- ఓ వైపు దశాబ్ది ఉత్సవాలు..

కార్యాలయం మాత్రం అపరిశుభ్రం

నవతెలంగాణ-కామారెడ్డి(తాడ్వాయి)

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి నేటికి పది సంవత్సరాలు పూర్తవుతుంది. రాష్ట్ర సీఎం కేసీఆర్ ఈ సందర్భంగా దశాబ్ది ఉత్సవాలను నిర్వహించాలని అన్ని జిల్లాల అధికారులకు, నాయకులకు, మంత్రులకు, ఎమ్మెల్యేలకు ఆదేశాలు ఇచ్చారు. అందులో భాగంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాలో శతాబ్ది ఉత్సవాలకు కలెక్టరేట్లు, కార్యాలయాలు, పార్టీ కార్యాలయాలు అన్ని సిద్ధం చేస్తున్నారు.

ఇక్కడి వరకు అంతా బాగానే ఉన్నా కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కలెక్టరేటు కార్యాలయంలో మాత్రం ఎక్కడ వేసిన చెత్త అక్కడే ఉంది. కలెక్టరేటు కార్యాలయ పర్యవేక్షణ కరువైందని పలువురు ఆరోపిస్తున్నారు.

పలు శాఖల కార్యాలయాల్లో చెత్తా చెదారం



ఎక్కడిచెత్త అక్కడే..



వృథాగా పోతున్న నీరు

మార్క్‌ఫెడ్ కార్యాలయంలో ఎక్కడ వేసిన చెత్త అక్కడే ఉంది. తాగి పడేసిన చాయ్ గ్లాసులు, ఇతరాత్ర చెత్తాచెదారం అంతా కూడా ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నట్లుగా ఉంది. కార్యాలయంలోకి వెళ్లాలన్నా అంతా దుమ్ము దూళితో తయారైంది. పట్టింపుకునేవారే కరువయ్యారు.

మూత్రశాలకు వెళ్తే ముక్కుమూసుకోవాల్సిందే

కలెక్టరేట్ కార్యాలయం బయట నుంచి చూస్తే మేడిపండు చందంగా మారింది. పైన పటారం.. లోన లొటారం అన్నట్టు తయారైంది. మూత్ర శాలలకు లోపలికి వెళ్తే.. ముక్కుమూసుకోవాల్సిందే. అంతా అపరిశుభ్రంగా తయారైంది. నల్లాలు ఆఫ్ కాకపోవడంతో నీరు వృథాగా పోతోంది. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

ఊడిన సీలింగ్

చెల్లింపుల శాఖా కార్యాలయం పక్కన పైన సీలింగ్ ఊడిపోయింది. దీంతో కీటకాలకు నిలయంగా మారుతోంది. ఇకనైనా అధికారులు స్పందించి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టి చెత్తాచెదారం ఉండకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రైతు బాగుంటేనే రాజ్యంలో వెలుగులు

- మార్కెటింగ్ వ్యవస్థ మెరుగవ్వాలి
- మంచి విత్తనం, ఎరువులు అందేలా చూడాలి
- రైతుబంధు, రైతు బీమా మంచి పథకాలే
- నవతెలంగాణతో రైతు సంఘం సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి

'మన నీళ్లు, నిధులు, నియామకాలు మనకే అనే నినాదంతోనే రాష్ట్రం ఏర్పడింది. రాష్ట్రమేర్పడ్డప్పటి నుంచి నేటి వరకు కొన్ని అంశాల్లో ప్రభుత్వ తీరు బాగుంది. మరికొన్నింటిలో మెరుగుపరుచుకోవాల్సిన అవసరముంది. పలు అంశాల్లో ప్రభుత్వ వైఖరి దారుణంగా ఉంది. ఏమాటకు ఆమాటేగానీ మంచి జరిగితే మంచే అనాలి. అదే సమయంలో ప్రజలకు జరుగుతున్న నష్టాలను, ఇబ్బందులను కూడా అంతే స్పష్టం చెప్పాలి. సాగునీటి రంగంపై గత ప్రభుత్వాల కంటే ఎక్కువగానే సీఎం కేసీఆర్ దృష్టి పెట్టి పనిచేశారు. ఫలితంగా ఇరిగేషన్ సిస్టమ్ మెరగైంది. ఇంకా మెరుగు కావాల్సిన అవసరమూ ఉంది. వ్యవసాయ రంగాన్ని పట్టించుకోవటంలేదు. రైతుబంధు, రైతు బీమా పథకాలు మంచివే. కానీ, అవి అన్నదాతలకు పూర్తిగా అండగా ఉండటం లేదు. రైతులు బాగుండాలంటే మంచి విత్తనం, ఎరువులు, మెరుగైన మార్కెటింగ్ వ్యవస్థ ఉండాల్సిందే. రుణ సహాయం అందేలా చూడాల్సిందే. రైతు బాగుంటేనే రాజ్యం వెలిగిపోతుంది. రాష్ట్రంలో ఆర్థిక, సామాజిక రంగాల్లో మార్పులు వేగంగా జరుగుతున్నాయి. సామాజికంగా ఆందోళనకర పరిస్థితులు తయారవుతున్నాయి. ఇది ప్రమాదకరం. ధరణి రైతులకు నష్టదాయకంగా మారింది. ప్రజా ఉద్యమాలపై నిర్బంధం పెరుగుతున్నది. ఇది మంచిదిగాదు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా ప్రజల మనస్సును ఎరిగి నడుచుకుంటే మంచిది' అని రైతు సంఘం సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి అన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆయన నవతెలంగాణకు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

నవతెలంగాణ-హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ వచ్చిన నాటి నుంచి నేటి వరకు ఆర్థిక, సామాజిక రంగాల్లో, ప్రజల జీవితాల్లో వచ్చిన ప్రధాన మార్పులేంటి?

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆదాయ వనరులు కొంత పెరిగిన మాట వాస్తవమే. కొనుగోలుశక్తి పెరిగింది. కానీ, స్వయంపోషకత్వ స్థాయికి ఇంకా చేరుకోలేదు. తెలంగాణలో కుల, మతాలకతీతంగా అన్న, అక్క, బావ, మామ, తాత ఇలా వరుసలు పెట్టుకుని పిలుచుకునే సాంప్రదాయం మొదటి నుంచీ ఉంది. కానీ, బీజేపీ దూకుడు పెరిగాక నాలుగైదేండ్లుగా గ్రామాల్లో పరిస్థితిలో మార్పు వస్తున్నది. ప్రజల మధ్య వైషమ్యాలు పెరుగుతు న్నాయి. కులాంతర వివాహాలు చేసుకుంటే అమ్మాయిలను, అబ్బాయిలను చంపేసే ఘటనలు తీవ్రం కావడం ఆందోళనకరం. కుల దురంహకార హత్యలు పెరిగాయి. ప్రతి ఏటా 3,500 మంది అమ్మాయిలు వ్యభిచార గృహాలకు తరలించబడు తున్నారు. వారంతా పేదలు, అనాథలే. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను ఆర్భాటంగా ప్రకటించి మధ్యలోనే ఆపేస్తున్నది. ఓటుబ్యాంకును కాపాడుకునే పథకాలు ఎక్కువై పోతున్నాయి.

తెలంగాణ వచ్చాక రాష్ట్ర బడ్జెట్ తీరుతెన్నులపై మీ అభిప్రాయమేమి?

మన నిధులు మనం వాడుకుకోవడం పెరిగింది. అభివృద్ధి కూడా జరుగుతున్నది. అయితే, బడ్జెట్‌ను ప్రతి ఏటా అంచనాలకు మించి పెంచుకుంటూ పోతున్నారు. రాని ఆదాయాన్ని చూపడం అవసరమా? 2014 నుంచీ పద్దుల మీద చూపుతున్న ఆదాయం రావట్లేదు. గత బడ్జెట్‌లో రూ.40 వేల కోట్లు గ్రాంట్ రూపంలో వస్తుందని చూపారు. వచ్చింది రూ.12 వేల కోట్లు మాత్రమే. ఇంత తేడానా? జీఎస్‌డీపీలో అప్పువాటాను 4 శాతానికి పెంచుకున్నది. ఇప్పుడు 4.5 శాతానికి పెంచాలని కొట్లాడుతున్నది. విచిత్రమేమిటంటే కార్పొరేషన్ల పేరుతో ఇప్పటిదాకా రాష్ట్ర సర్కారు లక్ష కోట్ల రూపాయల అప్పు తెచ్చింది. ఇది బడ్జెట్‌లో చూపెట్టరు. అప్పులు తెచ్చి ఉత్పత్తి రంగం మీద పెడితే తిరిగి వస్తుంది. కానీ, అనుత్పాద రంగం మీద ఎక్కువ ఖర్చు జరుగుతున్నది. ఇది మంచి పరిణామం కాదు. 2022-23లో మద్యం ద్వారా 17,500 కోట్ల రూపాయలు వస్తుందని ప్రభుత్వం అంచనా వేసింది. రూ.1500 కోట్ల రూపాయల అదనపు ఆదాయం వచ్చింది. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ఆదాయాలు పెరిగాయి. ట్యాక్సులు, మద్యం ద్వారా 34 వేల కోట్ల రూపాయల ఆదాయం వచ్చింది. మిగతా ఆదాయాలన్నీ తగ్గాయి. మద్యం అమ్మకాలు పెరగటం వల్ల చాలా కుటుంబాలు నాశనం అవుతున్నాయి.

తెలంగాణ వచ్చాక ఇరిగేషన్ సిస్టమ్ ఎంత మేర మెరుగైంది?

రాష్ట్రమేర్పడిన తర్వాత ఇరిగేషన్ సిస్టమ్ మెరుగైంది. ఎన్టీఆర్, చంద్రబాబు, కిరణ్‌కుమార్‌రెడ్డి, రోశయ్య ప్రభుత్వాలు ఇరిగేషన్ మీద అంత దృష్టి పెట్టలేదు. జలయజ్ఞం పేరుతో రాజశేఖర్‌రెడ్డి హడావిడి చేసినప్పటికీ మధ్యలోనే పనులు ఆగాయి. దీంతో రాష్ట్రంలో సారవంతమైన భూములున్నప్పటికీ సరైన పంటలు పండకపోయేవి. కేసీఆర్ ప్రభుత్వం ఇరిగేషన్ మీద ప్రధానంగా ఫోకస్ పెట్టింది. కాళేశ్వరం పూర్తయింది. మహబూబ్‌నగర్‌లోని ప్రాజెక్టులు 70 శాతం దాకా పూర్తయ్యాయి. గతంలో 40 లక్షల ఎకరాలకు సాగునీరందింతే..ఇప్పుడది 70 లక్షల ఎకరాలకు చేరుకున్నది. కోటి ఎకరాలకు అందిస్తానని కేసీఆర్ చెబుతున్నాడుగానీ ఇప్పట్లో అయ్యే పనికాదు. కేంద్ర ప్రభుత్వం కృష్ణాబోర్డు, గోదావరి బోర్డుల పేరుతో ఏపీ, తెలంగాణ మధ్య వివాదాలు సృష్టిస్తున్నది. దీని ప్రభావం ఉత్పత్తి రంగంపై పడుతున్నది.

రాష్ట్రంలో వ్యవసాయ ప్రణాళికపై మీ అభిప్రాయమేమి?

గతేడాది వ్యవసాయ ప్రణాళికనే ప్రకటించలేదు. ఏటా ఎప్పుడు ప్రకటిస్తున్నారో? ఏ ప్రాతిపదికన రూపొందిస్తున్నారో? అర్థంకాని పరిస్థితి. భూసార పరీక్షలు నిర్వహించి ఏ భూమిలో ఏం పంటలు వేయాలనే విషయాన్ని చెప్పాలని రైతు సంఘాలు చాలా ఏండ్ల నుంచి పోరాటం చేస్తున్నా పాలకులకు ఎక్కట్లేదు. రాష్ట్రంలో సాగుమొత్తం రెండు, మూడు పంటల చుట్టే తిరుగుతున్నది. వరి 60 లక్షల ఎకరాల్లో, పత్తి 70 లక్షల ఎకరాల్లో, హార్టికల్చర్ 6 లక్షల ఎకరాల్లో, మిగతా పంటలన్నీ ఐదు నుంచి పది లక్షల ఎకరాల్లో సాగవుతున్నాయి. రాష్ట్రానికి ఏటా 40 లక్షల టన్నుల కూరగాయలు అవసరమైతే 10 లక్షల టన్నులు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. ఉల్లిగడ్డ విషయంలోనూ అదే పరిస్థితి. దారుణమేమిటంటే 30 వేల టన్నుల కొత్తిమీర దిగుమతి అవుతున్నది. పండ్లూ ఇతర రాష్ట్రాల నుంచే వస్తున్నాయి. ఇవన్నీ మనం ఉత్పత్తి చేయొచ్చుగదా! హైదరాబాద్ చుట్టూతా ఎటూ 70 కిలోమీటర్ల మేర సాగుభూములన్నీ రియల్టర్ల చేతిలో పడి బీడుపడ్డాయి.

రైతు బంధు, రైతు బీమా పథకాలు ఏమేరకు దోహదపడుతున్నాయి? రాష్ట్రంలో రుణ ప్రణాళిక అమలవుతున్నదా?

రైతుబంధు, బీమా ఈ రెండు పెట్టడం రైతులకు మేలు జరుగుతున్నది. అన్నదాతలకు వెసులుబాటు దక్కింది. రైతు బీమా బాధిత కుటుంబాలకు ఉపయోగపడుతున్నది. ఈ విషయంలో ప్రభుత్వాన్ని అభినందించాల్సిందే. కౌలు రైతులకూ మేలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటే బాగుంటుంది. రాష్ట్రంలో రుణ ప్రణాళిక అమలు కావట్లేదు. అన్నీ బుక్ అడ్జెస్ట్‌మెంట్లే. ఏటా బ్యాంకులిచ్చే రుణాల్లో 18 శాతాన్ని రైతులకు ఇవ్వాలనే ఆర్బీఐ గైడ్‌లైన్స్‌ను బ్యాంకులు పాటించడం లేదు. బ్యాంకుల్లోని ఎక్కువ డబ్బు ప్రభుత్వానిదే. రైతులకు రుణాలివ్వాలనే విషయంపై బ్యాంకులపై రాష్ట్ర సర్కారు ఒత్తిడి తేవడంలేదు. ఫలితంగా రైతులు ప్రయివేటులో అప్పులు తెచ్చుకుంటున్నారు. దాదాపు రూ. 20 వేల కోట్ల అప్పులను రైతులు ప్రయివేటు వ్యక్తుల దగ్గర 30 శాతానికి వడ్డీకి తెచ్చుకున్నారు. వాటిని తీర్చలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. రాష్ట్రంలో జీరో రైతు ఆత్మహత్యలున్నాయని సీఎం చెప్పడం పెద్ద అబద్ధం. ఏటా సగటున 640 మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. వారంతా సన్న,చిన్నకారు, కౌలు రైతులే.

రాష్ట్రంలో అన్నదాతలకు మేలైన విత్తనాలు అందుతున్నాయా?

అందట్లేదు. కల్తీ విత్తనాల అమ్మకం వ్యవస్థాగతంగా నడుస్తున్నది. రాష్ట్రమొచ్చినప్పటి నుంచి ఇప్పటిదాకా 950కిపైగా నకిలీ విత్తనాల కేసులు నమోదయ్యాయి. రెండువేల మందిపైగా వ్యాపారుల మీద కేసులు పెట్టారు. అందులో 800 మంది మీద పీడీ యాక్టు తెరిచారు. గతేడాది 25 వేల క్వింటాళ్ల నాసిరకం విత్తనాలు పట్టుబడ్డాయి. నాసిరకం విత్తనాలతో సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. విత్తనాల ప్యాకెట్లపై 60 శాతం జెర్మినేషన్(విత్తనం మొలకెత్తే సామర్థ్యం) అని రాసి వంద శాతానికి డబ్బులు తీసుకుంటున్నారు. దీనిపై అడిగేటోడే లేడు. కంపెనీల నుంచి రైతులకు నష్టపరిహారం ఇప్పించే విషయాన్ని వ్యవసాయ అధికారులు మరిచారు. కల్తీ విత్తనాల దందాకు అడ్డుకట్ట వేయకపోతే వ్యవసాయ రంగం బాగుపడదు.